కాలినడకన తిరుమలకు జాన్వీ కపూర్



ప్రముఖ సినీనటి జాన్వీ కపూర్ శుక్రవారం కాలినడకన తిరుమలకు వచ్చారు.అలిపిరి నుంచి స్నేహితులతో కలిసి సాయం త్రం బయలుదేరిన ఆమె రాత్రి తిరుమల చేరుకున్నారు. శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. నడకమార్గంలో పలువురు సినీ అభిమానులు ఆమెతో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



రేపే ముగ్గుల పోటీలు

తిరుపతి, చిత్తూరు, మదనపల్లెల్లో

ఆంధ్రజ్యోతి ఏటా సంక్రాంతికి ముందు నిర్వహించే ముత్యాల ముగ్గుల పోటీలు రేపు జరగనున్నాయి. తెలుగు సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న ఈ పోటీలు తిరుపతి, చిత్తూరు, మదనపల్లి కేంద్రాల్లో ఆదివారంనాడు జరుగుతాయి. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు..గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో పై మూడు కేంద్రాల్లో జరుగుతాయి. తిరుపతి నగరంలో నెహ్రూ మున్సిపల్ స్కూల్ మైదానం (స్విమ్స్ సర్కిల్), చిత్తూరులో పీసీఆర్ డిగ్రీ కాలేజ్ గ్రౌండ్స్(గాంధీ బొమ్మ సమీపం) , మదనపల్లెలో జడ్పీహైస్కూల్ గ్రౌండ్ (ఆర్టీసీ బస్టాండు దగ్గర) లలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు ఉంటాయి. పోటీల్లో పాల్గొనదలచిన మహిళలు ఉదయం 9 గంటలకే పోటీలు నిర్వహించే మైదానాల వద్దకు చేరుకొని తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పోటీలు జరిగే ప్రతి కేంద్రంలో మొదటి, రెండు, మూడు బహుమతులు ఉంటాయి. ఈ మూడు కేంద్రాల్లో ప్రథమ బహుమతి పొందిన ముగ్గురిలో ఒకరిని జిల్లా విజేతగా ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల విజేతలు, కర్ణాటక, తమిళనాడు నుంచి ఎంపికైన ఇద్దరు, మొత్తం 15 మందికి జనవరి 11వ తేదిన విజయవాడలో ఫైనల్ పోటీలు ఉంటాయి. తిరుపతిలో జరిగే పోటీలకు చిల్లీస్ రెస్టారెంట్స్ అధినేత అంజి, చిత్తూరులో జరిగే పోటీలకు జీజెఎం ఛారిటబుల్ ట్రస్ట్, మదనపల్లెలో జరిగే పోటీలకు శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కాలేజ్, ఆర్కే జ్యువెలర్స్ లోకల్ స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, తిరుపతి

శ్రీసిటీలో ఎయిర్ స్ట్రిప్



అవకాశాలు పరిశీలించాలని ఏవియేషన్ అధికారులకు సీఎం సూచన

తిరుపతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు, వరదయ్యపాలెం మండలాల్లో విస్తరించి ఉన్న శ్రీసిటీ సెజ్‌లో విమానాల రాకపోకలకు వీలు కల్పించేలా ఎయిర్‌స్ట్రిప్ ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సివిల్ ఏవియేషన్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్రంలోని ఎయిర్‌పోర్టుల అభివృద్ధి, కొత్త ఎయిర్‌పోర్టుల ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు, ఏపీ సివిల్ ఏవియేషన్ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని విమానాశ్రయాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలతో పాటు కొత్తగా ఏర్పాటు చేయాల్సిన ఎయిర్‌పోర్టుల, ఎయిర్ స్ట్రిప్‌ల గురించీ ఆలోచించాలని సూచించారు. అందులో భాగంగా శ్రీసిటీ పరిధిలో ఎయిర్ స్ట్రిప్ గురించి ప్రస్తావించారు. పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులు, విదేశీ ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వ అధికారులు రాకపోకలు సాగించడానికి వీలుగా శ్రీసిటీలో ఎయిర్ స్ట్రిప్ అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఆయన సివిల్ ఏవియేషన్ అధికారులకు సూచించారు.

ఆగస్టులోనే ప్రస్తావన

శ్రీసిటీ సెజ్ ఏర్పాటు చేసే సమయంలోనే ఎయిర్‌స్ట్రిప్ నిర్మించాలనే ప్రతిపాదన ఉంది. సెజ్‌కోసం 10వేల ఎకరాల సేకరించాలని తొలుత ప్రతిపాదించగా 8వేల ఎకరాలు మాత్రమే ఇప్పటి వరకూ సేకరించారు. ఇంకా పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి భూముల కోసం డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో తొలినాటి ప్రతిపాదనలకు అనుగుణంగా మరో 2వేల ఎకరాల భూములు సేకరించి ఏపీఐసీసీ ద్వారా శ్రీసిటీకి అప్పగించాలని సీఎం చంద్రబాబు జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మూడవ నెలలోనే గత ఏడాది ఆగస్టు 19న శ్రీసిటీలో పర్యటించారు. ఆ సందర్భంలో ఎయిర్‌స్ట్రిప్ అంశం ప్రస్తావనకు వచ్చినట్టు తెలిసింది. దానిపై సెజ్ యాజమాన్యం నుంచి పూర్తి వివరాలు తీసుకొని నివేదించాలని జిల్లా యాంత్రంగాన్ని సీఎం ఆదేశించారు. ఆతర్వాత ఎయిర్‌స్ట్రిప్ అవసరం, అవకాశాలు, ఇతర మౌళిక సదుపాయాల గురించిన వివరాలు కోరుతూ జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఇటీవల శ్రీసిటీ యాజమాన్యానికి లేఖ రాశారు. వారి నుంచి స్పందన వచ్చిన తర్వాత ఎయిర్‌స్ట్రిప్‌పై మరింత స్పష్టత రానుంది.

మళ్లీ కొండెక్కుతున్న 'పుష్ప'లు



పట్టుబడిన ఎర్రచందనం దుంగలు, కారుతో ఫారెస్ట్ అధికారులు

తిరుమల, జనవరి3(ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లపాటు తిరుమలకు దూరంగా ఉన్న ఎర్రచందనం స్మగ్లర్లు తిరిగి కొండపై కన్నేశారు. ఎంతో కట్టుదిట్టమైన భద్రతా ఉన్నా తిరిగి తిరుమలకు సమీపంలో శేషాచల అడవుల్లో ఎర్రచందనం దోచుకోవడం మొదలుపెట్టారు. తిరుమల శేషచల అడవుల్లో విలువైన ఎర్రచందనం సంపద ఉన్న విషయం తెలిసిందే. ఐదారేళ్ల కిందటి వరకు తిరుమలకు సమీపంలో పార్వేటమండపం, పాపవినాశనం, శ్రీవారిపాదాలు, శ్రీవారి మెట్టు, శిలాతోరణం, కుమారధార, పసుపుధార వంటి ప్రాంతాల్లో ఎర్రచందనం అక్రమ రవాణా యథేచ్ఛగా జరిగేది. వందల టన్నుల కొద్దీ ఎర్రచందనం దుంగలను వాహనాల ద్వారా తిరుమల ఘాట్ నుంచే తరలించేవారు. నిఘాను పటిష్టం చేయడంతో తిరుమల నుంచి ఎర్రచందనం అక్రమ రవాణాకు చెక్‌పడింది. కొన్నేళ్ల పాటు స్మగ్లర్లు తిరుమల కొండను వదిలిపెట్టి మిగిలిన ప్రాంతాలపై పడ్డారు. తాజాగా మళ్లీ తిరుమల కొండెక్కడం మొదలుపెట్టారు. భక్తుల ముసుగులో ఇతర రాష్ట్రాల వాహనాలతో తిరుమలకు చేరుకుని సమీపంలోని అడవుల్లో ఎర్రచందనం చెట్లను కూలదోస్తున్నారు. దుంగలను వాహనాల్లో ఎక్కించి నెమ్మదిగా తిరుమల నుంచి జారుకుంటున్నారు. ముందస్తు సమాచారంతో ఫారెస్ట్ విభాగం అధికారులు ఇటీవల తిరుమల పరిసర ప్రాంతాల్లో ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా పెట్టడంతో డిసెంబరు 19వ తేదీన కుమారధార, పసుపుధార ప్రాంతంలో దాదాపు 150 కేజీల బరువున్న ఐదు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడులోని సేలంకు చెందిన సతీష్, వెంకటేషన్, త్యాగరాజన్‌ను అరెస్ట్ చేశారు. తాజాగా, గురువారం సాయంత్రం ముందస్తు సమాచారంతో శిలాతోరణం చెక్‌పోస్ట్ వద్ద కర్ణాటక రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఓ కారును అడ్డుకున్నారు. కారు నుంచి దిగి పారిపోయే ప్రయత్నం చేసిన తమిళనాడు విల్లుపురంకు చెందిన రమేష్ గోవింద రాజ్ అనే డ్రైవర్‌ను చాకచక్యంగా పట్టుకుని అరెస్ట్ చేశారు. కారుతో పాటు కారులోని దాదాపు 536 కేజీల బరువు కలిగిన 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అతడి వద్ద లభించిన సెల్‌ఫోన్‌లోని నెంబర్ల ద్వారా మిగిలిన స్మగ్లర్ల ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. రమేష్ ఇచ్చిన నెంబర్లన్నీ స్విచ్‌ఆఫ్‌లో ఉండటంతో తమదైన శైలిలో విచారిస్తున్నారు. ఇలా కొన్నేళ్లుగా తిరుమలకు దూరంగా ఉన్న ఎర్రచందనం స్మగ్లర్లు తిరిగి స్వామి క్షేత్రానికి వచ్చే సాహసం చేస్తున్నారు. అయితే శేషాచల అడవుల నుంచి ఎర్రచందనం తరలించాలని చూస్తే ఉపేక్షించేది లేదని, ఇప్పటికే అన్ని ప్రాంతాలను జల్లెడపడుతున్నామని ఫారెస్ట్ అధికారులు హెచ్చరిస్తున్నారు.

శేషాచలంలో బీటెక్ విద్యార్థుల అదృశ్యం

- ఆచూకీ కోసం అటవీశాఖ అధికారులతో కలసి పోలీసుల గాలింపు
- మిత్రులకు లొకేషన్ షేర్ చేసిన ఓ విద్యార్థి



శేషాచలం అడవి నుంచి లైవ్ లొకేషన్ పంపిన విద్యార్థి

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం శేషాచల అడవుల్లో బీటెక్ విద్యార్థులు అదృశ్యమయ్యారని సమాచారం. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఆరుగురు బీటెక్ విద్యార్థులు ఇక్కడి వాగేటికోన ప్రాంతంలో.. గుంజన జలపాతాలను చూడడానికి శుక్రవారం విహారయాత్రగా వచ్చారు. తిరుగు ప్రయాణంలో దారి తప్పినట్లు తెలిసింది. రాత్రి కావడంతో ఆందోళన చెందిన వీరు.. ఫోన్ సిగ్నల్స్ రావడంతో మిత్రులకు సమాచారం అందించారు. మిత్రుల సలహా మేరకు లైవ్ సిగ్నల్స్ లొకేషన్ పంపించారు. వీరంతా అడవిలో తిరుగుతూ చివరకు రైల్వేకోడూరు అటవీ పరిధిలోని ఎస్.ఉప్పరపల్లి, ఎస్.కొత్తపల్లి ప్రాంతాల పరిధిలోకి రాగానే ఫోన్ సిగ్నల్స్ రావడంతో రేణిగుంట పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు రేణిగుంట పోలీసులు కోడూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ హేమసుందర్ రావు ఆదేశాల మేరకు కోడూరు ఎస్ఐ నవీన్ బాబు తమ సిబ్బందితో అటవీశాఖ అధికారులతో కలిసి అడవిలో జల్లెడ పడుతున్నారు. సెల్ ఫోన్ సిగ్నల్స్ అందుబాటులోకి వస్తే వారి ఆచూకీ త్వరగా లభిస్తుంది. తప్పిపోయిన విద్యార్థుల వివరాల కోసం పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.

ఇంటర్ విద్యార్థులకు

నేటినుంచి మధ్యాహ్న భోజనం

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలు
- జిల్లాలో 5,759 మందికి ప్రయోజనం



చంద్రగిరి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పళ్లేలు, గ్లాసులు అందజేస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవి తదితరులు

తిరుపతి(విద్య), జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఒక్కో హామీని నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. ఇందులో భాగంగా ఇంటర్ విద్యార్థులకు శనివారం నుంచి మధ్యాహ్న భోజనం అమలు చేయనుంది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో జిల్లాలో 5,759 మందికి ప్రయోజనం చేకూరనుంది. ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు చాలా ఏళ్లనుంచి మధ్యాహ్న భోజన పథకం అమల్లో ఉంది. అయితే జూనియర్ కళాశాలల్లోనూ పేద, సామాన్య విద్యార్థులు ఎక్కువగా ఉండటం.. సుదూర గ్రామాల నుంచి రాకపోకలు సాగిస్తుండటంతో ఉదయాన్నే భోజనం తెచ్చుకోవడానికి ఇబ్బంది పడేవారు. దీనిని గమనించిన గతంలోని టీడీపీ ప్రభుత్వం 2014- 2019 మధ్య కాలంలో జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ పథకాన్ని నిలిపేసింది. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడటంతో పాటు కొంత హాజరుశాతంకూడా తగ్గింది. ఇంటర్ విద్యార్థుల ఇబ్బందులను, వారి తల్లిదండ్రుల అభ్యర్థనను అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. తాము అధికారంలోకి వస్తే ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజనాన్ని అమలు చేస్తామని నారా లోకేష్ యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చారు. ఆ మేరకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పేరుతో శనివారం నుంచి ప్రారంభిస్తున్నారు. విద్యార్థులకు అవసరమైన పళ్లాలు, గ్లాసులను ప్రభుత్వం ఇప్పటికే పంపిణీ చేసింది. వంట బాధ్యతలను కళాశాలలకు సమీపంలోని ఉన్నత పాఠశాల భోజన పథకం నిర్వాహకులు లేదా స్వయం సహాయక బృందాలకు అప్పగించారు.

విద్యార్థులకు ఎంతో మేలు



కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకాన్ని పునరుద్ధరించి ఇంటర్ విద్యార్థులకు ఎంతో మేలు చేసింది. ఈ పథకం అమలువల్ల డ్రాపౌట్స్ తగ్గుతారు. విద్యార్థుల హాజరు శాతం మెరుగుపడుతుంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరే వారి సంఖ్యా పెరుగుతుంది.

- ప్రభాకర్‌రెడ్డి, ఆర్ఐవో, తిరుపతి జిల్లా

నేటి మెనూ

సోమవారం: అన్నం, కూరగాయల కూర, ఉడికించిన గుడ్డు, చిక్కీ
మంగళవారం: పులగం లేదా పులిహోర, పల్లీచట్నీ, కోడిగుడ్డు ఫ్రై, రాగిజావ
బుధవారం: అన్నం, సాంబారు, ఉడికించిన గుడ్డు, చిక్కీ
గురువారం: కూరగాయల అన్నం (వెజిటబుల్ రైస్), గుడ్డుకూర, రాగిజావ
శుక్రవారం: అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ
శనివారం: అన్నం, కందిపప్పు చారు, బెల్లం పొంగలి, రాగిజావ

వైవిధ్య ఆలోచనలు..

- శ్రీకాళహస్తిలో జిల్లా సైన్స్ ఫేర్

వినూత్న ఆవిష్కరణలు

శ్రీకాళహస్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కొత్త కొత్త ఆలోచనలతో.. వినూత్న ఆవిష్కరణలకు విద్యార్థులు తెరతీశారు. శ్రీకాళహస్తి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా సైన్స్‌ఫేర్‌లో తమ వైజ్ఞానిక ప్రదర్శనలను ఉంచారు. ఇందులో కొన్ని ప్రదర్శనలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. విద్యార్థి, వ్యక్తిగత, సామూహిక, ఉపాధ్యాయ విభాగాల్లో జిల్లాస్థాయి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విజేతలకు కలెక్టరు వెంకటేశ్వర్ జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ నమూనాల్లో కొన్ని..

వర్షపునీటితోనే తోట సాగు



భవనంపై కురిసే వాన చినుకులను పైపులు, సెన్సర్ల ద్వారా ఇంటి ఆవరణలోని పూలు, పండ్ల మొక్కలను సాగు చేసే విధానాన్ని ఆవిష్కరించారు రాజశేఖర్. పాకాల మండం ఓబులశెట్టివారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇతడు ఉపాధ్యాయుడు వెంకటరమణ పర్యవేక్షణలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ప్రయోగాన్ని ప్రదర్శించి ద్వితీయ స్థానంలో నిలిచాడు.

మద్యం తాగితే వాహనం కదలదంతే

డ్రంకెన్ డ్రైవ్ ప్రమాదాలను అరికట్టేందుకు శ్రీకాళహస్తిలోని బాబుఅగ్రహారం పాఠశాలకు చెందిన చరణ్ 'ఆటోమేటిక్ ఇంజన్ లాకింగ్ సిస్టమ్' ప్రయోగాన్ని రూపొందించారు. డ్రైవర్ మద్యం తాగి వాహనాన్ని నడిపే ప్రయత్నం చేస్తే సెన్సర్ ఆల్కాహాల్ వాసనను పసిగట్టి ఆటోమేటిక్‌గా వాహనం ఆగిపోయేలా తయారు చేశారు. ఉపాధ్యాయురాలులు వరలక్ష్మి పర్యవేక్షణలో చరణ్ చేపట్టిన ఈ ప్రయోగం విద్యార్థుల వ్యక్తిగత విభాగంలో జిల్లా ప్రథమస్థానంలో నిలిచింది.



అంధుల దిక్సూచి



అంధుల కోసం స్మార్ట్ బ్లైండ్ వాకింగ్ స్టిక్‌ను వరదయ్యపాళెం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మేఘనాథ్ పర్యవేక్షణలో రితీష్, వరుణ్‌రెడ్డి ఆవిష్కరించారు. 9 ఓల్ట్స్ బ్యాటరీతో అల్ట్రా వయలెంట్ సిగ్నల్ సెన్సర్‌తో ఈ వాకింగ్ స్టిక్ ఆటోమేటిక్‌గా సూచనలు చేసి ప్రమాదాల నుంచి తప్పిస్తుంది. ఇది గ్రూపు విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది.

ఎక్స్‌కవేటర్ మోడల్ నమూనా



సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు గజేంద్ర సలహాతో తక్కువ ఖర్చుతో పాస్కల్ సూత్రం ఆధారంగా జేసీబీ నమూనా యంత్రాన్ని గణేష్, జశ్వంత్‌కుమార్‌రావు ఆవిష్కరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పని చేయొచ్చు. ఈ ప్రయోగం ద్వితీయ స్థానంలో ఎంపికైంది.

మలుపుల వద్ద ప్రమాదాలకు చెక్



రోలింగ్ బ్యారియర్స్ అనే సిద్ధాంతంతో.. మలుపులకు చెక్ పెట్టేలా వరదయ్యపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన టీచరు సుబ్బరామయ్య కొత్త ప్రయోగాన్ని ముందుకు తెచ్చారు. మలుపుల వద్ద వాహనాలు ఢీకొన్న వెంటనే రబ్బర్‌బాల్స్ వంటి వాటిని తాకడం వల్ల అవి తిరగడంతో శక్తి వికేంద్రీకరణ జరిగి వాహనాలు దెబ్బ తినకుండా కట్టడి చేస్తుంది. దాంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడవచ్చు. ఉపాధ్యాయుల వ్యక్తిగత విభాగంలో ఈ ప్రదర్శన ద్వితీయ స్థానం సాధించింది.

దివ్యాంగులకు ప్రత్యేక వాహనం



లిఫ్ట్ తరహాలో దివ్యాంగులు సులభంగా బస్సు ఎక్కడం.. కావాల్సిన చోట దిగబెట్టడం వంటి ఆవిష్కరణను శ్రీకాళహస్తిలోని ఆర్‌పీబీఎస్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన బయాలజీ ఉపాధ్యాయుడు మధుసూదన్‌రావు ప్రదర్శించారు. ఉపాధ్యాయుల వ్యక్తిగత విభాగంలో ప్రథమస్థానం సాధించారు.

పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : నాని


గోకులం షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఎ.రంగంపేట, కందులవారిపల్లె, చిన్నరామాపురం సచివాలయాలను పైలెట్ ప్రాజెక్టులో భాగంగా 103 గోకులాలు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా తొలుత శుక్రవారం ఎ.రంగంపేటలో మినీ గోకులం నిర్మాణానికి అధికారులతో కలిసి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ పాలకులు వ్యవసాయ రంగాన్ని గాలికి వదిలేశారన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో సుశీలాదేవి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా విద్యతోనే సమాజాభివృద్ధి



ఎర్రావారిపాళెం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మహిళా విద్యతోనే సమాజం అన్ని విధాలా అభివృద్ధి చెందు తుందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఎంఈఓ వెంకట బాలసుబ్రమణ్యం తెలియజేశారు. శుక్రవారం ఎర్రావారిపాళెంలోని కేజీబీవీ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. యూటీ ఎఫ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిం చారు. అనంతరం టీచర్లు శ్రీదేవి, అర్చన, ప్రియవందన, మంజుల, లావణ్య, స్వరూప, మునిరత్నమ్మ, విజయలక్ష్మితో పాటు ఈవోఆర్డీవో మాలతిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 సతీష్ బాబు, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు సదాశివరెడ్డి, ఆర్జేయూపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెల సిద్ధయ్య, ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మల్లేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయం

పాకాల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా మహిళల విద్యాభివృద్ధి కోసం సావిత్రిబాయి పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రిన్సిపాల్ డాక్టర్ మోహిద్దీన్‌బాషా అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళా అధ్యాపకులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్‌కుమార్, మహిళా విభాగం సమన్వయకర్త డాక్టర్ మాధవి, అధ్యాపకులు చిట్టికళావతి, రమణమ్మ, రేఖ, విష్ణుప్రియ, మాధవి, నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుచానూరు: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో సావిత్రి బాయిపూలే జయంతి వేడుకలు జరిగాయి. తిరుపతి రూరల్ ఎంఈవో మహ్మద్ రఫీ, ప్రధానోపాధ్యాయులు మురళి మాట్లాడుతూ దేశంలో తొలిసారిగా మహిళల కోసం పాఠశాలను స్థాపించిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని కీర్తించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయురాలు ప్రభావతిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు వెంకటముని, సుదర్శన్, పళని, ప్రదీప్, ప్రశాంతి, మీనాకుమారి పాల్గొన్నారు.

అమ్మవారికి వేడుకగా తిరువీధి ఉత్సవం



తిరుచానూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారికి శుక్రవారం రాత్రి అత్యంత వేడుకగా తిరువీధి ఉత్సవం జరిపించారు. ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి మూలమూర్తికి నేత్రపర్వంగా అర్చకులు అభిషేకం నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లకు కల్యాణోత్సవం జరిగింది. మధ్యాహ్నం ఫ్రైడే గార్డెన్‌లో సుగంధ పరిమళ ద్రవ్యాలతో పద్మావతిదేవికి అత్యంత వేడుకగా తిరుమంజనం నిర్వహించారు. సర్వ అలంకార శోభితురాలైన అమ్మవారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాకాల జడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి జన్మదిన వేడుకలు



చంద్రగిరి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పాకాల మండల జడ్పీటీసీ నంగా పద్మజాబాబురెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు జడ్పీటీసీ నంగా పద్మజాబాబురెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాలు కప్పి సన్మానించారు. టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వెలి వేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


అంబేద్కర్ విగ్రహం ముందు ఆందోళన వ్యక్తం చేస్తున్న మాల మహానాడు నేతలు

తిరుపతి(వైద్యం), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేశారనే కక్షతో ఏడు కుటుంబాలను వెలివేసిన గ్రామపెద్దలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు కల్లూరి చెంగయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మాలమహానాడు నేతలతో కలిసి శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ముందు ఆందోళన చేశారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలం ఉప్పుమిల్లి గ్రామంలో తాము చెప్పిన వారికి ఓటు వేయలేదని ఏడు కుటుంబాల వారిని గురువారం గ్రామం నుంచి వెలివేయడం అమానుషమన్నారు. ఇలాంటి చర్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరి


కశ్యప్ మహేష్ గాత్ర కచేరి

తిరుమల శ్రీవారి ఆలయం ముందున్న నాదనీరాజనం వేదికపై శుక్రవారం సాయంత్రం నిర్వహించిన గాత్ర కచేరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తమిళనాడు తిరుచ్చిరాపల్లికి చెందిన ఏగ్రేడ్ ఆర్టిస్ట్ ఆర్ కశ్యప్ మహేష్ తన బృందంతో కలిసి ఈప్రదర్శన ఇచ్చారు. అన్నమయ్య, త్యాగరాజు, పురందరదాసు వంటి ప్రముఖులు రచించిన కీర్తనలను మధురంగా ఆలపించి భక్తులను మైమరపించారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

మాడవీధుల్లో విష్ణుసహస్రనామ పారాయణం



తిరుమల, జనవరి3(ఆంధ్రజ్యోతి): తిరుమల ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠంలోని వేదవిద్యార్థులు శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్నారు. పవిత్ర ధనుర్మాసంలో తమ పీఠంలో విద్యార్థులు ధనుర్మాస వ్రతం ఆచరించారు. ఈ సందర్భంగా అదనపు ఈవో వెంకయ్య చౌదరి వీరికి శుక్రవారం దర్శనం కల్పించారు. అంతకుముందు వేదవిజ్ఞాన పీఠం ప్రధానోపాధ్యాయులు కెఎస్ఎస్ అవధాని ఆధ్వర్యంలో విద్యార్థులు తమ అధ్యాపకులతో కలిసి శ్రీవారి ఆలయ మాడవీధుల్లో ప్రదక్షిణగా వెళ్లి శ్రీవిష్ణుసహస్ర నామ పారాయణ గోష్ఠి చేశారు.

డ్రోన్ వ్యవసాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ వ్యవసాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. డ్రోన్ వ్యవసాయానికి సంబంధించి ప్రస్తుతం 35 మంది పైలట్స్ శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు. డ్రోన్ ద్వారా వ్యవసాయం చేసేందుకు అభ్యర్థులు కనీసం ఇంటర్మీడియట్, డిప్లొమో ఇన్ అగ్రికల్చర్, గ్రాడ్యుయేట్ ఇన్ అగ్రికల్చర్ విద్యార్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. డీజీసీఏ పైలెట్ సర్టిఫికెట్ పొందిన వారికి మాత్రమే కిసాన్ డ్రోన్‌ను అందజేస్తారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రోన్ వ్యవసాయం కోసం 80 శాతం సబ్సిడీతో కూడిన, 50 శాతం బ్యాంకు రుణాల ద్వారా రైతులకు అందించాలని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. కిసాన్ డ్రోన్ వలన కూలీల కొరతను అధిగమించవచ్చని తెలియజేశారు. సమయం ఆదా అవుతుందని తెలిపారు. పిచికారీ చేసే మందుల ఖర్చు కూడా తగ్గుతుందని తెలిపారు.

టైలరింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ద్వారకానగర్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 7వ తేదీ నుంచి 30 రోజుల పాటు మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాలో గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు కలిగిన నిరుద్యోగ మహిళలు ఈశిక్షణకు అర్హులని తెలిపారు. శిక్షణకు దరఖాస్తు చేసు కొనేవారు కనీసం పదో తరగతి చదివి ఉండాలని వివరించారు. మరిన్ని వివరాలకు 7989680587, 9494951289, 6301717672 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ మెంబర్‌గా నిరంజన్‌బాబు



రామచంద్రాపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రామపురంలో ఉన్న సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. నిరంజన్‌బాబు జాతీయ స్థాయిలో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ మెంబర్‌గా ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ సుమలత తెలిపారు. శుక్రవారం సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేసి మీడియా సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.నిరంజన్‌బాబు మాట్లా డుతూ కౌన్సిల్ మెంబర్‌గా ఎంపికవడం సంతోషకరమన్నారు. తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబును కరస్పాండెంట్ సుమలత, బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బందితో ఘనంగా సత్కరించారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడి మృతి

తిరుపతి(నేరవిభాగం), జనవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో యువ కార్మికుడు మృతి చెందిన ఘటన శుక్రవారం తిరుపతి రూరల్ పరిధిలోని మల్లంగుంటలో చోటు చేసుకుంది. సీఐ చిన్నగోవిందు కథనం మేరకు... వడమాలపేట మండలం యనమలపాలెంకు చెందిన గురునాథం చిన్న కుమారుడు చరణ్ ఇటీవల ఐటీఐ పూర్తిచేశాడు. ఎలక్ట్రీషియన్ భాస్కర్ వద్ద మూడు నెలలుగా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం మల్లంగుంట వద్ద వున్న ఎంవీఆర్ రెసిడెన్సీ అపార్టుమెంటులో ఎలక్ట్రిక్ పనులు చేస్తున్నాడు. ఆ సమయంలో ప్రమాదవ శాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అపస్మారక స్థితికి చేరుకున్నాడు. మెరుగైన వైద్యం కోసం వెంటనే నారాయణాద్రి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో రుయాకు తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ మూర్తి కేసు నమోదు చేశారు.

వైకుంఠద్వార దర్శన టోకెన్ల జారీకి పటిష్ట ఏర్పాట్లు


సమీక్షిస్తున్న జేఈఈవో గౌతమి

తిరుమల, జనవరి3(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శన టోకెన్లు జారీ చేసే కేంద్రాలలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని టీటీడీ జేఈవో గౌతమి అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని పరిపాలన భవనంలో శుక్రవారం ఆమె అధికారులతో సమీక్షించారు. 10, 11, 12వ తేదీలకు సంబంధించి జనవరి 9వ తేదీన ఉదయం 5 గంటలకు నుంచి 1.20 లక్షల టోకెన్లు జారీ చేసేలా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. మిగిలిన రోజులకు ఏరోజుకారోజు ముందురోజు టోకెన్లు భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణునివాసంలో మాత్రమే జారీ చేసేలా అవసరమైన ప్రణాళికలు పక్కాగా రూపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, అకౌంట్స్ ఆఫీసర్ వెంకటరమణ, వీఎస్వో సదాలక్ష్మి, వైద్యాధికారి నర్మద తదితరులు పాల్గొన్నారు.

తిరుచానూరులో మళ్లీ దొంగలు పడ్డారు


ధరణి లేఅవుట్‌లో నడుచుకుంటు వెళుతున్న దొంగ, తలుపు గడియ విరగొట్టినదృశ్యం, ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

తిరుచానూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మళ్లీ దొంగలు పడ్డారు. రెండు నెలల క్రితం వేదాంతపురంలో ఓ మహిళను చంపేసి నగలను దోచేకెళ్లారు. అది మరువకముందే పది రోజుల క్రితం పాడిపేటలో ఓ వృద్ధురాలిని హత్యచేసి ఆమె ఒంటిపై నగలు దోపిడీచేశారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు గ్రామ పంచాయతీ ముళ్లపూడి క్రాస్‌లోని ధరణి లేఅవుట్‌లోని ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. బాధితుని కథనం మేరకు.. ధరణి లేఅవుట్‌లో శ్రీనివాసులు కుటుంబం నివాసం ఉంటోంది. తిరుమలలో వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజులుగా వారు తిరుమలలోనే ఉండటంతో గుర్తు తెలియని అగంతకుడు లేఅవుట్‌లోని ప్రతి ఇంటి గేటు వద్దకు వెళ్లి పరిశీలించాడు. తలకు మంకీక్యాప్, చేతి గ్లౌజ్‌లు వేసుకుని ప్రతి ఇంటి గేటు తీసి పరిశీలించాడు. శ్రీనివాసులు ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇంటి తలుపు గడియ విరగొట్టి లోనికి ప్రవేశించాడు. సీసీ కెమెరాలో ఈ దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. బాధితుడు తిరుమల నుంచి ఇంకా రాకపోవడంతో చోరీ సొత్తుపై స్పష్టత లేదు. పోలీసులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలిం చారు. ఇదిలా ఉండగా శివారు కాలనీ ప్రాంతాల కాలనీల వైపు పోలీసులు రాత్రిపూట గస్తీ నిర్వహించక పోవడంతో ఇలా వరుస దొంగతనాలు, హత్యలు జరుగుతున్నాయని ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

రూరల్‌లో రసాభాసగా గ్రామసభలు

ఓటేరులో వైసీపీ సర్పంచ్, ఉపసర్పంచ్‌లు బాయ్‌కట్


అవిలాలలో గ్రామ సభ

తిరుపతిరూరల్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలంలోని ఓటేరు, అవిలాల, గాంధీపురం పంచాయతీల్లో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలు రసాభాసగా జరిగాయి. తమతోపాటు వార్డుసభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కార్యదర్శి లావణ్య పంచాయతీలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపిస్తూ ఓటేరుకి చెందిన వైసీపీ సర్పంచ్ లక్ష్మి, ఉప సర్పంచ్ చంద్రమౌళిలతో కొందరు వార్డు సభ్యులు బాయ్‌కట్ చేసి వెళ్లిపోయారు. బిల్‌కలెక్టర్‌గా పనిచేసే శేషాద్రిని విధుల నుంచి ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. దీనిపై కార్యదర్శి స్పందిస్తూ బిల్ కలెక్టర్ సమయ పాలన పాటించలేదన్నారు. ప్రజలనుంచి ఫిర్యాదులు అధికంగా రావడంతో ఇంటిపన్నులు వసూలు చేసేందుకు తాత్కాలికంగా వేణు అనేవ్యక్తిని నియ మించామని వివరించారు. అలాగే గ్రామసభ నిర్వహణ విషయమై ముందురోజే సమాచారం అందించామని తెలిపారు. బీజేపీ యువమోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వర్ మాట్లాడుతూ సర్పంచ్, ఉపసర్పంచ్‌లు నాలుగేళ్లుగా పంచాయతీల్లో అడ్డగోలుగా వ్యవహరించారని, బిల్ కలెక్టర్ తాగునీటి కుళాయి కనెక్షన్ల కోసం ప్రజల నుంచి ఎక్కువడబ్బులు వసూలు చేశారని దీనికి ఆధారాలున్నాయని పేర్కొన్నారు. పంచాయతీకి శ్మశానస్థలం కేటాయించాలని కోరారు.

అవిలాల పంచాయతీలో..

అవిలాల పంచాయతీ పరిధిలో జరిగిన సభకు ఎంపీటీసీ హరికృష్ణారెడ్డితో శానప్ప కాలనీకి చెందిన వైసీపీ కార్యకర్త శివశంకర్ అనే వ్యక్తి వచ్చి తమకు గ్రామసభ నిర్వహణ సమాచారం చెప్పలేదని, ప్రొటోకాల్ పాటించడం లేదంటూ ఇన్‌చార్జి కార్యదర్శి శ్రీలేఖపై చిందులేశారు. ఇలాగే వ్యవహరిస్తే మాజీ ఎమ్మెల్యేని తీసుకొచ్చి పంచాయతీకి తాళాలు వేసేరోజు వస్తుందని హెచ్చరించారు. సభ నిర్వహణకు సంబంధించి గ్రామంలో దండోరా వేయించిన సర్టిఫికెట్, సర్పంచ్, వార్డుసభ్యుల సంతకాలు, వీడియో ఉందని కార్యదర్శి తెలియజేశారు.

గాంధీపురంలో..

పంచాయతీలో ఎన్నో సంవత్సరాలుగా పనిచేసే ఉద్యోగులను తొలగించాలని, వారికి జీతాలు పెట్టొద్దని గాంధీపురం పంచాయతీకి చెందిన కొందరు కూటమి పార్టీ నేతలు గ్రామసభలో రభస చేశారు. దీనిపై ఉద్యోగులు మాట్లాడుతూ పంచాయతీల్లో నాలుగైదు నెలలు ముందు కొత్తగా ఏడుగురిని నియమించుకున్నా రని, ఈ నేపథ్యంలో సంవత్సరాలుగా పనిచేస్తున్న తమని తొలగించమని కోరడం అన్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కార్యదర్శి విజయనిర్మల మాట్లాడుతూ పని చేసిన వారికి జీతాలు పెట్టేలా చర్యలు చేపడుతామని వివరించారు. కాగా పలు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. రోడ్లు, డ్రైన్లు, తాగునీటి పైపులైన్ల ఏర్పాటు వంటి వాటికి ప్రతిపాదనలు చేసి తీర్మానించారు. అవిలాల సర్పంచ్ వెంకటరమణ, గాంధీపురం సర్పంచ్ లక్ష్మి, ఓటేరులో వార్డుసభ్యులు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.

కార్యదర్శిపై వైసీపీ నేత దౌర్జన్యం.. కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం) జనవరి 3 (ఆంధ్ర జ్యోతి): తిరుపతి రూరల్ మండలం సాయినగర్ పంచాయతీ సెక్రటరీపై వైసీపీ నేత శివ దౌర్జన్యం చేశాడు. దీంతో అతడిపై కేసు నమోదైంది. సీఐ చిన్న గోవిందు కథనం మేరకు... అవిలాల పంచాయతీలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో సాయినగర్ పంచాయతీ సెక్రటరీ శ్రీలేఖ పాల్గొన్నారు. అయితే ప్రొటోకాల్ పాటించలేదనే ఆరోపణలపై ఎంపీటీసీ హరికృష్ణారెడ్డి, పంచాయతీ సెక్రటరీతో మాట్లాడుతుండగా హరికృష్ణారెడ్డి వెంట వచ్చిన వైసీపీ నేత శివ కల్పిం చుకున్నాడు. సెక్రటరీ శ్రీలేఖను అసభ్య పదజాలంతో దూషిం చాడు. అవసరమైతే తప్పుడు కేసులు పెట్టి ఉద్యోగం తీసి వేయిస్తానని బెదిరించాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు.

వాహనం సహా ఎర్రచందనం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న వాహనం, ఎర్రచందనం దుంగలతో అటవీ సిబ్బంది

భాకరాపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వాహనంతో సహా 6 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట ఎఫ్ఆర్‌వో వెంకటరమణ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గురువారం రాత్రి శ్రీనివాస మంగా పురం నుంచి తమిళ నాడుకు ఎర్రచందరం అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారంతో అటవీ సిబ్బంది ఆ ప్రాంతంలో కాపు కాశారు. శుక్రవారం తెల్లవారుజామున ఒక వాహనం అటువైపు రాగా ఆపినా ఆగకుండా రేణిగుంట బైపాస్ వైపు వెళ్లిపోయింది. సిబ్బంది వెంబడించడంతో రేణిగుంట కేఎల్ఎం సర్కిల్ సమీపంలో వాహనాన్ని ఆపేసి ఇద్దరు వ్యక్తులు పారి పోయారు. ఆ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 900 కిలోల 31 ఎర్రచందనం దుంగలు ఉన్నాయి. దుంగలను, వాహనాన్ని స్వాధీనం చేసుకుని అటవీ కార్యాలయానికి తరలించారు. ఈ దాడిలో ఎఫ్ఎస్‌వో ప్రదీప్ కుమార్, ఎఫ్‌బీవోలు రాజేశ్, కుమార్, రవి, డ్రైవర్ శంకర్, రవితేజ, వాచర్లు శ్రీనివాసులు, కేశవులు, అంజన్‌కుమార్, వినీల్‌కుమార్ పాల్గొన్నారు.

తిరుపతికి నిరంతర విద్యుత్ ప్రభుత్వ లక్ష్యం


ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందిస్తున్న ఎస్ఈ, డీఈలు

తిరుపతి(ఆటోనగర్), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరానికి అవసరమైన విద్యుత్ సరఫరా చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. స్థానిక విద్యుత్ ఎస్ఈ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం తిరుపతి నియోజకవర్గ పరిధిలోని విద్యుత్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. నగరంలో విద్యుత్ అంతరాయం లేకుండా తీసుకుంటున్న చర్యల గురించి ఆరా తీశారు. విద్యుత్ శాఖకు ఎదురవుతున్న సవాళ్ల గురించి ఎస్ఈ పి.సురేంద్రనాయుడు ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతినెలా నగరపాలక, టీటీడీ విద్యుత్, ఇంజనీరింగ్, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయం చేసుకుని సమస్య లేకుండా చేయాలన్నారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఎస్ఈ కరుణాకర్, ఈఈలు వి.చంద్రశేఖర్‌రావు, పి.బాలాజీ, వాసవీలత, నగరపాలక ఈఈ చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వస్తువుల వేలం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎక్సైజ్ బేవరేజస్ పరిధిలోని డిపోలో ఉన్న వివిధ ఎలక్ట్రానిక్ వస్తువులు వేలం వేస్తున్నట్లు డిపో మేనేజర్ జానకిరాం తెలిపారు. ఐఎంఎఫ్ఎల్ డిపో పరిధిలో 135 ఫ్రీజర్లు, 148 ఇన్‌వెర్టర్‌లు, క్యాష్ మిషన్లు, 376 స్కానర్లు, 185 క్యాష్ కౌంటింగ్ మిషన్లు ఉన్నట్లు పేర్కొన్నారు. రేణిగుంట రోడ్డులోని పాత ఈనాడు కార్యాలయం వెనుక ఉన్న తిరుపతి డిపోలో ఈనెల 9న ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం వేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రూ.5వేలు ముందస్తు డిపాజిట్ చెల్లించి, పాల్గొనాలని కోరారు.

ట్యాక్సీలన్నీ ఔటర్‌రింగ్ రోడ్డులోనే తిరగాలి


ట్యాక్సీ డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ హరిప్రసాద్

తిరుమల, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా పది రోజుల పాటు జరగనున్న వైకుంఠద్వార దర్శనానికి భక్తులు అధికసంఖ్యలో తిరుమలకు వస్తారని, ట్రాఫిక్ సమస్య లేకుండా ట్యాక్సీలన్నీ ఔటర్ రింగ్ రోడ్డులోనే తిరగాలని తిరుమల ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ డ్రైవర్లను ఆదేశిం చారు. తిరుమలలో శుక్రవారం ఆయన ట్యాక్సీ డ్రైవర్లతో సమావేశమయ్యారు. ఇన్నర్ రింగ్ రోడ్డులోని పార్కింగ్ స్థలాల్లో ఉన్న వాహనాలను తొలగించాలన్నారు. భక్తులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని, అధిక ఛార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తీర్థాల వద్ద సౌకర్యాలపై ఈవో సమీక్ష

తిరుమల, జనవరి3(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని తీర్థాలు, ఉప ఆలయాల నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులతో సమీక్ష నిర్వహించారు. శుక్రవారం అన్నమయ్య భవనంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి సమావేశం నిర్వహించారు. ఆకాశగంగ, పాపవినాశనం, చక్రతీర్థాలలో పార్కింగ్, లైటింగ్, పచ్చదనం, క్యూలైన్లు, సూచిక బోర్డులు, ఉప ఆలయాల్లో ప్రసాద దిట్టం, పలు నిర్మాణ పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సీఈ సత్యనారాయణ, డిప్యూటీ ఈవో వెంకట్రామయ్య పాల్గొన్నారు.

తిరుపతిలో ఇద్దరు గంజాయి దొంగల అరెస్టు

● రెండు కిలోలు, 21 గంజా చాక్లెట్లు స్వాధీనం


ప్రతాప్‌కుమార్, నింబారాం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం అలిపిరి పోలీసులు ఇద్దరు అంతర్రాష్ట్ర గంజాయి దొంగలను పట్టుకున్నారు. వారి నుంచి దాదాపు రూ.50 వేలు విలువ చేసే రెండు కిలోల గంజాయి.. 21 గంజాయి చాక్లెట్లను శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. అలిపిరి సీఐ రాంకిషోర్ కథనం మేరకు.. ఒడిశాకు చెందిన ప్రతాప్‌కుమార్ జానీ.. ఆటోనగర్‌లో కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువులు అమ్ముకునే నింబారాం మంచి స్నేహితులు. వీరు కొంత కాలంగా ఒడిశా నుంచి గంజాయి తెప్పించి చిన్న, చిన్న ప్యాకెట్లు చేసి విక్రయిస్తున్నారు. ఒడిశాలోని వ్యాపారుల ద్వారా ప్రతాప్‌కుమార్ జానీ ఇక్కడకు రైలు లేదా అతడే వెళ్లి తీసుకొచ్చేవాడు. ఏడాది కాలంగా నింబారాం.. తనకు తెలిసిన విద్యాసంస్థలకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. అలిపిరి సీఐ రాంకిషోర్‌కు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలసి ఆటోనగర్‌లోని దుకాణంపై తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో దాదాపు రెండు కిలోల గంజాయి, 21 గంజాయి చాక్లెట్లు సీజ్ చేశారు. ప్రతాప్‌కుమార్ జానీ, దుకాణంలోని నింబారాంను అరెస్టు చేశారు.

ఫార్మాసిస్టు, స్టాఫ్‌నర్సుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(వైద్యం), జనవరి 3(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ కడప జోన్ పరిధిలో ఖాళీగా ఉన్న 15 ఫార్మాసిస్టు, 150 స్టాఫ్ నర్సుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తులను వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకుని, నిర్దేశిత రుసుంతో పాటు ధ్రువపత్రాలను జత చేసి నేరుగా లేదా పోస్టు ద్వారా గడువులోపు కడప ఆర్డీ కార్యాలయానికి పంపాలని తెలిపారు.

సావిత్రీబాయి పూలే జీవితం ఆదర్శనీయం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) : ఎస్సీ ఎస్టీ పీజీ-పీహెచ్‌డీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఎస్వీయూ సెనేట్ హాల్లో సావిత్రీబాయి పూలే జయంతి సభ నిర్వహించారు. మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు హాజరై మాట్లాడుతూ తొలి బాలికా పాఠశాలను ఏర్పాటు చేసిన ఘనత సావిత్రీబాయి పూలేకు దక్కుతుందన్నారు. ఎస్వీయూ వీసీ అప్పారావు మాట్లాడుతూ సావిత్రీబాయిపూలే జీవితాన్ని అందరూ చదవాలన్నారు. తుడా అధికారి లక్ష్మి మాట్లాడుతూ సావిత్రీబాయి పూలేకు భారతరత్న ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధారాణి, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

● **పద్మావతి వర్సిటీలో** : సావేరీ హాల్లో వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి సభ నిర్వహించారు. వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, తుడా వైస్ చైర్మన్ వెంకటనారాయణ, వే ఫౌండేషన్ అధ్యక్షుడు పైడి అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో..

తిరుపతి(విద్య) : స్థానిక ఎస్టీ రోడ్డులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి, పుష్పాంజలి ఘటించారు. వేమన విజ్ఞాన కేంద్రం నడ్డి నారాయణ, ఇన్‌కంటాక్స్ అధికారి సోమయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సావిత్రిబాయి అందించిన సేవలను కొనియాడారు. హెచ్‌ఎం వెంకటసుబ్బమ్మ, ఉపాధ్యాయులు పారిజాతం, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

బీజేపీ ఆధ్వర్యంలో తీర్థకట్ట వీధిలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి, పుష్పాంజలి ఘటించారు. ఉపాధ్యాయురాలు పీఎం లేఖశ్రీని సత్కరించారు. పూలే సేవలను గుర్తుచేసుకున్నారు. బీజేపీ నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, ప్రభాకర్‌నాయుడు, విజయభాస్కర్‌రెడ్డి, కస్పా పద్మనాభన్ పాల్గొన్నారు.


సభలో ప్రసంగిస్తున్న మాజీ ఐఏఎస్ అధికారి శ్రీనివాసులు

బీసీ సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో..

తిరుపతి(జీవకోన) : నగర పరిధిలోని ఎమ్మార్‌పల్లె వద్ద గల సీతమ్మనగర్ కూడలిలో బీసీ సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సమితి అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య, సభ్యులు లక్ష్మయ్య యాదవ్, సాకం నాగరాజు, అశోక్ సామ్రాట్ యాదవ్, బీవీ.కేశవులు, రామయ్య, రమణ, కట్టమంచి చంద్రబాబు, సురేష్, మస్తానమ్మ, పెంచులయ్య, మురళి పాల్గొన్నారు.

ఐద్వా నివాళి

తిరుపతి (ఆటోనగర్): కపిలతీర్థం రోడ్డులోని టీటీడీ ఏడీ బిల్డింగ్ ఎదుట శుక్రవారం ఐద్వా ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటం పెట్టి పుష్పాంజలి ఘటించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి మహిళా అభ్యున్నతికి పూలే చేసిన కృషిని వివరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, ఐద్వా నాయకురాళ్లు జయంతి, త్యాగవాణి, ఉమ, లక్ష్మీ, యుగంధర్, చిట్టిబాబు, మధు, బాబు, ప్రకాష్ పాల్గొన్నారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌లో మొరాయించిన సర్వర్లు

తిరుపతి (సెంట్రల్) జనవరి3 (ఆంధ్రజ్యోతి): రైల్వే టికెట్ రిజర్వేషన్ కౌంటర్‌లో సర్వర్లు పనిచేయని కారణంగా ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వీఐపీలకు విడుదల చేసే అత్యవసర కోటా సర్వర్లు కూడా పనిచేయలేదు. దక్షిణ మధ్య రైల్వే కేంద్రమైన సికింద్రాబాదులో సాంకేతిక సమస్య కారణంగా సర్వర్ పనిచేయలేదు. ఉదయం తత్కాల్ సమయం తర్వాత సేవలు నిలిచిపోయాయి. జోనల్ స్థాయిలో అధికారులు ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. తిరుపతి రిజర్వేషన్ కౌంటర్‌లో రెండు కౌంటర్లు నిత్యం రద్దీగా ఉంటాయి. గంటల తరబడి ప్రయాణికులు వేచి ఉండాల్సి వచ్చింది. సాయంత్రం వరకు కూడా సర్వర్ మెల్లగా పనిచేయడంతో టికెట్లు రద్దు చేసుకోవడానికి వచ్చిన ప్రయాణికులు నష్టపోవాల్సి వచ్చింది. గతంలో ఇలాంటి సమస్య ఎప్పుడూ రాలేదని, ఇదే తొలిసారని అధికారులు తెలిపారు.


సర్వర్లు పనిచేయకపోవడంతో వేచి ఉన్న ప్రయాణికులు


పరిశుభ్రంగా కనిపిస్తున్న సప్తగిరికాలనీ వీధులు

చెత్త నిల్వల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మంగళం పరిధిలోని సప్తగిరికాలనీ వీధులలో చెత్తనిల్వలు తొలగించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'పేరుకున్న చెత్తకుప్పలు' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. స్పందించిన సచివాలయ కార్యదర్శి జయశంకర్ పారిశుధ్య కార్మికులతో చెత్తను పూర్తిగా తొలగించారు.ఇచ్చట చెత్త వేయరాదని సూచిక బోర్డులు పెట్టించారు.

అగర్వాల్ స్టీల్ పరిశ్రమపై కేసులు నమోదు చేయాలి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 3(ఆంధ్రజ్యోతి): అగర్వాల్ స్టీల్ పరిశ్రమ యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలని సీఐటీయూ నాయకులు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వారు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ అగర్వాల్ స్టీల్ పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ఓ కార్మికుడు మృతి చెందాడని, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ఆరు నెలల కిందట ఇదే రకంగా పేలుడు సంభవించి ఓ కార్మికుడు మృతి చెందాడని గుర్తుచేశారు. నిర్లక్ష్యం, నిర్వహణ లోపం, తనిఖీలు లేకపోవడం వంటి కారణాలతోనే ఘటన పునరావృతమైందన్నారు. మృతుడి కుటుంబానికి రూ.కోటి, క్షతగాత్రులకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందించాలన్నారు.

పట్టించుకోండి సారూ..

రోడ్డు కంపు..కంపు



కరకంబాడి రోడ్డులోని తిరుమలనగర్ పంచాయతీ పరిధిలో మంగళం ఆర్టీసీ డిపో రోడ్డు పొడవునా చెత్త నిల్వలు పేరుకున్నాయి. కుళ్లిన చెత్త దుర్గంధం వెదజల్లుతోంది. ఈ క్రమంలో ఆ దారిలో రాకపోకలు సాగించే చెంచులక్ష్మి యానాదికాలనీ, జయశంకర్‌కాలనీ, తుడా క్వార్టర్స్ ప్రజలు, ఆర్టీసీ సిబ్బంది ముక్కులు మూసుకోవాల్సి వస్తోంది. గురువారం జరిగిన గ్రామసభలో ఈ విషయమై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ప్రజలు అంటున్నారు.

- తిరుపతి అర్బన్, (ఆంధ్రజ్యోతి)

సాహిత్యంతో చిన్నారులకు నీతిని అందించాలి

అనువాద కథల పుస్తకాల ఆవిష్కరణలో వక్తలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మనుషుల మధ్య మానవీయ విలువలు కనుమరుగవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కథల ద్వారా పిల్లలకు నీతిని బోధించాలని వక్తలు పేర్కొన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ) ఆధ్వర్యంలో రెండు అనువాద కథల పుస్తకాలను ఆవిష్కరించారు. తిరుపతికి చెందిన కృష్ణస్వామిరాజు రాసిన బాలల పుస్తకాలను సూర్యవంశీ కన్నడంలోకి అనువదించారు. ఈ పుస్తకాలను సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, రచయిత, పాత్రికేయుడు డాక్టర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ కథ పాఠకుడి హృదయాంతరాల్లోకి వెళ్లి అలజడి సృష్టించాలన్నారు. కథలు మనసును ప్రసన్నం చేస్తాయన్నారు. కథలు రాసిన, అనువాదం చేసిన రచయితలు చక్కటి శైలిని పాటించారని అభినందించారు. రచయిత, పాత్రికేయుడు డాక్టర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. విభిన్న సంస్కృతులు ఉన్న మన దేశంలో నోటి కథలకు విశేష ప్రాచుర్యం ఉందన్నారు. నోటి కథలకు కొనసాగింపుగానే పిల్లల కథలు ఉంటాయని అభిప్రాయపడ్డారు. రచయిత కృష్ణస్వామిరాజు, అనువాదకుడు సూర్యవంశీని అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్ఐ చైర్మెన్ రమాకాంత్‌శర్మ, అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, దుద్యాల చంద్రమోహన్, కార్యవర్గ సభ్యులు హర్షవర్ధన్‌రెడ్డి, మధుసూద్, మాజీ చైర్మెన్ సుధాకర్‌రెడ్డి, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వీసీ కృష్ణమూర్తి, రచయితలు ఉమామహేశ్వరరావు, కృష్ణస్వామిరాజు తదితరులు

బొటిక్ దుకాణంలో అగ్నిప్రమాదం

రూ.4 లక్షల ఆస్తినష్టం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్‌పల్లిలోని వినాయక విష్ణుప్రియ బొటిక్ దుకాణంలో శుక్రవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ వైర్ల షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దుకాణదారులు గుర్తించి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చేలోగా చీరలు, బ్లౌజులు, డ్రస్‌లు, టైలరింగ్ మిషన్లు, ఎంబ్రాయిడరీ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. రూ.4లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు తిరుపతి అగ్నిమాపక శాఖ అధికారి కిరణ్‌కుమార్ రెడ్డి చెప్పారు.

వాకర్స్ ఇంటర్నేషనల్ డైరెక్టరీ పుస్తకావిష్కరణ

తిరుపతి(జీవకోన), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీగోవిందరాజస్వామి ఆర్ట్స్ కాలేజీ మైదానంలో 2025 వాకర్స్ ఇంటర్నేషనల్ డైరెక్టరీ పుస్తకాన్ని గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతినిధులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, కోనేటి రవిరాజు, గోపిప్రసాద్‌లు శుక్రవారం ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, మాజీ డీఎస్పీ శంకర్, పోతప్ప, కార్పొరేటర్ ఎస్‌కే.బాబు, విజయభాస్కర్‌రెడ్డి, షాబుద్దీన్, రఘునాథరెడ్డి, మణి, జీవన్ పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడినవారిని పట్టించుకోండి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జనవరి 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ దౌర్జన్యాలకు ఎదురొడ్డి నిలిచి పార్టీ కోసం కష్టపడిన వారిని పట్టించుకోవడం లేదని, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత దక్కుతోందని అనుపల్లి పంచాయతీ నూతిగానిగుంటకు చెందిన తెలుగుదేశం పార్టీ బూత్ కన్వీనర్ బి.పురుషోత్తం ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పులివర్తి నాని దీనిపై దృష్టి సారించి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు.

ఇంటికి ఒకే డోర్ నంబరు ఉండేలా చూస్తాం


ఒక ఇంటికి మూడు డోర్ నెంబర్లు వేయడాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య, కూటమి నేతలు

తిరుపతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఒక ఇంటికి ఒకే డోర్ నంబరు ఉండేలా చర్యలు తీసుకోవాలని వచ్చిన ఫిర్యాదుపై కమిషనర్ మౌర్య శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫిర్యాదు చేసిన కూటమి నాయకులతో కలసి 36వ డివిజన్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. పాతబోర్లకు మరమ్మతులు, సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని నాయకులు కోరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. న్యూ బాలాజీ కాలనీ శ్మశానాన్ని పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని, వచ్చే ప్రజలకు వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించామన్నారు. దామినేడు ఇందిరమ్మ గృహాలను పరిశీలించామని, ఎన్ని గృహాల్లో ఎవరు కాపురం ఉంటున్నారు? ఖాళీగా ఎన్ని ఉన్నాయని సర్వే చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్ గోమతి, తుడ ఈఈ రవీంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్ ఆమె వెంట ఉన్నారు.

ప్రతి శుక్రవారమూ ఓపెన్ ఫోరం

తిరుపతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : నగర ప్రణాళిక విభాగం ద్వారా నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నగర ప్రణాళిక ఆధ్వర్యంలో ఓపెన్ ఫోరం కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారమూ తప్పకుండా ఓపెన్ ఫోరం కార్యక్రమం నిర్వహించి, పట్టణ ప్రణాళిక విభాగంలో వచ్చే ఫిర్యాదులు చర్చించి త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. మార్చి నెలాఖరులోపు పెండింగ్ ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. యాడ్ ఏజెన్సీల బకాయిల వసూలుపై దృష్టి సారించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న టీడీఆర్ బాండ్ల డోర్ నంబర్ కలిగిన వారికి మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఏసీపీ బాలాజి, టీపీబీవోలు మధుసూదన్, వంశీ పాల్గొన్నారు.

ఆర్కే అబాకస్ విద్యార్థుల ప్రతిభ

తిరుపతి(విద్య), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్‌పల్లెలోని ఆర్కే అబాకస్ సంస్థ(వీక్షదిస్కూల్) విద్యార్థులు బాలోత్సవం పోటీలలో పలు అంశాలలో ప్రతిభచాటి బహుమతులు సాధించారని చైర్మన్ డాక్టర్ టి.రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. డ్రాయింగ్, పెయింటింగ్‌లో ఆర్.యశితారెడ్డి ప్రథమస్థానం, మట్టితో బొమ్మల తయారీలో తాతిరెడ్డి వేదహర్షితరెడ్డి ద్వితీయ, మెమరీలో సోమసారీష్, క్లాసికల్ డ్యాన్స్‌లో వి.నైసిక ద్వితీయ బహుమతులు అందుకున్నారని తెలిపారు. డైరెక్టర్ విమల, డాక్టర్ శ్రీనివాస్, రెడ్డెప్ప అభినందించారు.

సైనిక్ స్కూల్ ప్రవేశపరీక్షపై రేపు విశ్వంలో అవగాహనా సదస్సు

తిరుపతి(విద్య), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరదరాజనగర్‌లోని విశ్వం స్కూల్‌లో జాతీయ స్థాయిలో నిర్వహించే సైనిక్ స్కూల్ ప్రవేశపరీక్షపై ఆదివారం ఉచిత అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. 4 నుంచి 9 తరగతుల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరై ప్రవేశపరీక్షా విధానం, ప్రశ్నపత్రం, సిలబస్ వంటి అంశాలపై సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 13వ తేదీతో ప్రవేశపరీక్షకు దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. ఇతర వివరాలకు 8688888802/9399976999లను సంప్రదించాలని కోరారు.



మొదటిఘాట్‌లో సోలార్ లైట్లను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ విభాగం సిబ్బంది

తిరుమల కనుమ దారుల్లో కొత్త సోలార్ దీపాలు

- మొదలైన పనులు -

తిరుమల, జనవరి3(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్లలో సోలార్ లైట్ల అమరిక పనులు మొదలయ్యాయి. 20 ఏళ్ల క్రితం ఈరోడ్లలో ఏర్పాటు చేసిన సోలార్ లైట్లు పాడైపోయాయి. గత పాలకులు వీటి నిర్వహణను పట్టించుకోలేదు. ఇందువల్ల రాత్రిపూట వాహనదారులూ, రోడ్డు దాటే సమయంలో వన్యప్రాణులూ ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త సోలార్ లైట్లను ఏర్పాటు చేయాలని టీటీడీ నిర్ణయించింది. ఇందులో భాగంగానే మొదటి ఘాట్‌రోడ్డులో 70, రెండవ ఘాట్‌రోడ్డులో పది ప్రాంతాల్లో నూతన సోలార్ ప్యాడ్లు, లైట్లను ఏర్పాటు చేసే పనులు గురువారం మొదలయ్యాయి. ప్రస్తుతం మొదటిఘాట్‌రోడ్డులో పనులు జరుగుతున్నాయి. వీటి ఏర్పాటుకు దాదాపు రూ.15 లక్షల మేరకు ఖర్చు కానుంది. ఇక, తిరుమల ప్రధాన రహదారుల్లోనూ పాత లైట్లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసే పనులు జరుగుతున్నాయి. శుక్రవారం జీఎన్సీ ఆర్చ్ నుంచి బాలాజీ బస్టాండ్ వరకు ఉన్న రహదారిపై 50 నూతన లైట్లను ఏర్పాటు చేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, సినీనటి రాశి సింగ్ ఉన్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూ ప్రసాదాలు అందజేశారు.



నేరెళ్ల శారద



రాశి సింగ్

శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం : రూ.4.17 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 62,085

తలనీలాలు సమర్పించినవారు: 15,680

పట్టుదల+కృషి = ఉద్యోగం





● తిరుపతి ఉపాధ్యాయనగర్‌కు చెందిన ఆదర్శ్ ఇంజినీరింగ్ చదివాడు. ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో కష్టపడి చదివాడు. మంచి మార్కులతో బీటెక్ పూర్తి చేశాడు. క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగం రాలేదు. కాలేజి నుంచి బయటపడ్డాక ఆఫ్ కేంపస్ ఉద్యోగాల కోసం చేయని ప్రయత్నం లేదు. ఇప్పటికీ ఆ ప్రయత్నాలు ఫలించలేదు..

● పద్మావతినగర్‌కు చెందిన గాయత్రి పీజీ పూర్తిచేసింది. మంచి మార్కులే సాధించింది. ఆకాంక్షలకు తగిన ఉద్యోగమే చేయాలనేది ఆమె ఆకాంక్ష. చిన్నపాటి ఉద్యోగాలు వచ్చినా జాయిన్ కాలేదు. బ్యాంకు, ఆర్‌ఆర్‌బీ ఇలా ఏ నోటిఫికేషన్ కనిపించినా దరఖాస్తు చేస్తోంది. కొన్నింటికి ఎక్కువమంది హాజరవుతారని నిరాశతో పరీక్షే రాయలేదు. మూగేళ్లయినా ఉద్యోగం పొందలేకపోతోంది.

ఉద్యోగ సాధనకు అకడమిక్ నాలెడ్జ్ ఒక్కటే సరిపోదంటున్నారు తిరుపతిలోని కౌటిల్య సంస్థ డైరెక్టర్ శ్రీధర్. ప్లేస్‌మెంట్ శిక్షణా సంస్థ నిర్వహిస్తున్న ఈయన యువత ఉద్యోగ సాధనకు అవసరమైన కొన్ని సూచనలిస్తున్నారు. ప్రత్యేక నైపుణ్యాలను పెంచుకుని, పట్టుదలతో సాధన చేస్తే ఉద్యోగ కల సాకారమవుతుందంటున్నారు. జాబ్ పొందడానికి ఆయన చెబుతున్న మార్గాలివి.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి



శ్రీధర్, కౌటిల్య శిక్షణా సంస్థ డైరెక్టర్

● అకడమిక్ జ్ఞానమొక్కటే సరికాదు

● అవసరమైన స్కిల్స్‌పై పట్టు సాధించాలి

రెండు రకాల ప్లేస్‌మెంట్లు ఉంటాయి. బీటెక్, మరేదైనా డిగ్రీ చదువుతున్న విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్లకోసం సన్నద్ధమవుతుంటారు. అయినా చాలా మంది విఫలమవుతుంటారు. బీటెక్ లేదా డిగ్రీ రెండో సంవత్సరం నుంచే జాబ్ ప్రిపరేషన్ అవసరం. కంపెనీలు కోరుకుంటున్న నైపుణ్యాలను అలవర్చుకోవాలి. ప్రత్యేకించి ఏదైనా సంస్థలో ఉద్యోగం కావాలనుకుంటే ముందుగా ఆ కంపెనీకి కావాల్సిన అర్హతలు, నైపుణ్యాలను తెలుసుకోవాలి. వాటికి తగ్గట్టుగా సాంకేతిక నైపుణ్యాలు (కోడింగ్)పై దృష్టి పెట్టాలి.

అకడమిక్ చదువులతో పాటు పరిశ్రమల నైపుణ్యాలకు సంబంధించి శిక్షణ తీసుకోవాల్సి ఉంటుంది. అయినప్పటికీ ఒక్కోసారి ఉద్యోగం సాధించడంలో విఫలం కావొచ్చు. అంతమాత్రాన నిరాశపడిపోకూడదు. తాము ఎందుకు విఫలమయ్యామో స్వీయ విశ్లేషణ చేసుకోవాలి. కారణాన్ని ఖచ్చితంగా అంచనావేసి ఆయా అంశాలను సరిచేసుకుని మళ్లీ ప్రయత్నిస్తే ఖచ్చితంగా విజయాన్ని సాధించొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ ఎక్కువగా ఉంటుంది... పోస్టులు తక్కువగా ఉంటాయి. అందుకు చాలామంది మొదట్లోనే నిరాశ పడతారు. పోటీలో నిలిచేందుకు ఆసక్తి చూపించరు. దరఖాస్తుదారులంతా పోటీ ఇవ్వరని గుర్తించరు. దరఖాస్తుదారుల్లో ఎక్కువ మంది డమ్మీ అభ్యర్థులే ఉంటారు. అందువల్ల సంఖ్యను చూసి ఆందోళన చెందక్కరలేదు.. పోటీ పరీక్షకు తగినట్టు సన్నద్ధమయితే చాలు. విశ్లేషణాత్మక అధ్యయనం, అభ్యాసంతో కూడిన సాధన అవసరం. అకడమిక్ కోసం చదివినట్టు చదివితే ఉద్యోగం రాదు. పోటీ పరీక్షకు తగినట్టుగా అవసరమైన అంశాలపై ఫోకస్ పెట్టాలి.

పోటీ పరీక్షల ప్రిపరేషన్ మొదలుపెట్టాక ఉద్యోగం సాధించడానికి 1 నుండి మూడేళ్లు పట్టవచ్చు. కొంత మందికి ఇంకా ఎక్కువ సమయం పట్టవచ్చు. దీర్ఘకాల పోటీలో చాలామంది వైదొలుగుతారు. కేవలం సీరియస్ అభ్యర్థులు మాత్రమే నిలబడతారు. దీర్ఘకాలం సమయం, పట్టుదలతో కూడిన ప్రిపరేషన్ ఉంటే సర్కారీ కొలువు సాధ్యమే.

బ్యాంకు పరీక్షలకు ప్రిపేరయితే తక్కువ సమయంలోనే ఉద్యోగం సాధించవచ్చు. బ్యాంకు పరీక్షల సిలబస్‌తో ఏటా సుమారు 20 పోటీ పరీక్షలు జరుగుతాయి. ఒకే శిక్షణతో, ఒకే సన్నద్ధతతో 20 పరీక్షలకు పోటీ పడొచ్చు. అందువల్ల ఏదో ఉద్యోగం రాక పోదు.

ఉద్యోగ సాధన ప్రయాణంలో మొదటగా ఏ చిన్న ఉద్యోగం వచ్చినా వదులుకోకూడదు. ఆ ఉద్యోగం చేస్తూనే దీర్ఘకాల లక్ష్యాన్ని నెరవేర్చేందుకు ప్రయత్నించాలి. చిన్న ఉద్యోగమైనా ఆర్థికంగా ఆసరాగా ఉంటుందని గ్రహించాలి. అది ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్నిఇస్తుంది. పెద్ద ఉద్యోగం పొందేందుకు ప్రోత్సాహకరంగా ఉంటుంది.



ముక్కంటిని దర్శించుకున్న విదేశీ భక్తులు

శ్రీకాళహస్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం 70మంది అమెరికా భక్తులు దర్శించుకున్నారు. పెంచలకోన కరుణామయి ఆశ్రమ వ్యవస్థాపకురాలు భగవతి విజయేశ్వరి దేవితో కలిసి వారు వచ్చారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అమెరికా భక్తుల శివనామస్మరణతో ఆలయం మారోమోగింది.

వైకుంఠ ఏకాదశికి తిరుమలలో

మైసూర్ నిపుణులచే విద్యుత్ అలంకరణలు

తిరుమల, జనవరి3(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈఏడాది వైకుంఠ ఏకాదశికి విద్యుత్ అలంకరణ విశేషంగా చేయాలని నిర్ణయించారు. మైసూర్ దసరా ఉత్సావాల్లో విద్యుత్ దీపాలంకరణలు చేసే నిపుణులు తిరుమలలో కూడా అలంకరణ చేస్తారు. అలాగే ప్రత్యేకమైన పౌరాణిక పాత్రలతో కూడిన పూల అలంకరణలూ చేయనున్నారు. ఈ వివరాలను శుక్రవారం అన్నమయ్య భవనంలో జరిగిన వైకుంఠ ఏకాదశి సమీక్షా సమావేశంలో అధికారులు వెల్లడించారు. టీటీడీ ఈవో శ్యామలరావు ఆధ్వర్యంలో జరిగిన సమీక్షా సమావేశంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, సీఈ సత్యనారాయణ, ఐటీ విభాగం జీఎం శేషారెడ్డి, అదనపు ఎస్పీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. శ్రీవారి భక్తులకు సులభతరంగా వైకుంఠద్వార దర్శనం కల్పించేందుకు అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశించారు. భక్తులకు వివిధ ప్రాంతాల్లో పార్కింగ్ కేటాయించడం ద్వారా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని సూచించారు. వైకుంఠ ఏకాదశి ముఖ్యాంశాలతో అధికారులు సమగ్ర మాస్టర్ డాక్యుమెంట్‌ను రూపొందించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈవోకు వివరించారు.



నారావారిపల్లెలో మెగా జాబ్ మేళా

● ఉద్యోగాలకు 689 మంది ఎంపిక



ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే



జాబ్‌మేళాకు హాజరైన యువత

చంద్రగిరి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు స్వగ్రామం.. చంద్రగిరి మండలం నారావారిపల్లెలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. టీటీడీ కల్యాణ మండపంలో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ మేళాకు నియోజకవర్గంలోని 1832 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి శ్రీసిటీ, నాయుడుపేట, రేణిగుంట, గాజులమండ్యం ఎస్‌ఈజెడ్‌లు, అనంతపురంలోని కియా మోటార్స్.. ఇలా 21 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 689 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరందరికీ సాయంత్రం ఎమ్మెల్యే పులివర్తి నాని, కలెక్టర్ వెంకటేశ్వర్ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ జాబ్‌మేళాలో ఉద్యోగం రానివారు నిరుత్సాహ పడకుండా ఆత్మస్థైర్యంతో ఉండాలన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో కంపెనీల ఏర్పాటుకు స్థలాలు అనువుగా ఉన్నాయని, వీటి ఏర్పాటుకు సహకారం అందిస్తామన్నారు. చంద్రగిరికి త్వరలో అనేక ప్రాజెక్టులు రానున్నట్లు చెప్పారు. సీఎం చంద్రబాబు తిరుపతి పర్యటనకు వచ్చినపుడల్లా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదేశించేవారని గుర్తుచేశారు. నారా లోకేశ్ యువగళంలో ఇచ్చిన మాట ప్రకారం నేడు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే పులివర్తి నాని చెప్పారు. ఆరు నెలలకు ఒకసారి మేళా న్విహిసన్తామన్నారు. త్వరలో చంద్రగిరికి ఐటీ కంపెనీలు వస్తాయన్నారు. ఉద్యోగం చిన్నదైనా, పెద్దదైనా ఆత్మస్థైర్యంతో పని చేసి, తల్లిదండ్రుల కష్టాలలో పాలుపంచుకోవాలని యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బొబ్బా లక్ష్మి, ఉపసర్పంచి రాకేష్‌చౌదరి, పులివర్తి సుధారెడ్డి, డీపీవో, స్పెషల్ ఆఫీసర్ సుశీలదేవి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, స్కిల్ డెవలప్మెంట్ అధికారి లోకనాథం, తహసీల్దారు శివరామసుబ్బయ్య, ఎంపీడీవో శేఖర్, వివిధ సంస్థల ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం

రూ.1.76 కోట్లు




శ్రీకాళహస్తి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి హుండీ ద్వారా రూ.1,76,75,333 వచ్చింది. ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ఈ హుండీ లెక్కింపు జరిగింది. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 73 గ్రాములు, వెండి 478.550కిలోలు, విదేశీ కరెన్సీ 186 వచ్చింది. ఈవో బాపిరెడ్డి ఈ హుండీ లెక్కింపును పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు- అత్తిపట్టు

రైల్వే రూట్ మ్యాప్ సిద్ధం

ఏపీ, తమిళనాడులో నాలుగేసి స్టేషన్లు



పుత్తూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు- అత్తిపట్టు మధ్య రైల్వే లైను రూట్ మ్యాప్ ప్రాజెక్టు సిద్ధమైంది. 88.30 కిలోమీటర్లు.. సింగిల్ విద్యుత్ లైను మార్గంలో ఎనిమిది స్టేషన్లను ప్రతిపాదించారు. జిల్లాలో నారాయణవనం, కృష్ణమరాజుకండ్రిగ, పిచ్చాటూరు, నాగలాపురం.. తమిళనాడులో ఊత్తుకోట, పాలవ్వాకం, పెరియపాలెం, గంగయాదికుప్పంలో స్టేషన్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పుత్తూరు రైల్వే స్టేషన్ నుంచి నారాయణవనం మూడు కిలోమీటర్ల పరిధిలో ఉండగా.. మిగిలిన స్టేషన్లు పది కిలోమీటర్ల వంతున ఉన్నాయి. పర్యాటక కేంద్రమైన కైలాసనాథకోనను దృష్టిలో ఉంచుకుని కృష్ణమరాజుకండ్రిగను కూడా స్టేషన్‌గా ప్రతిపాదించారు. ఇక, పుత్తూరు నుంచి దాదాపు 500 మీటర్ల దూరంలో అంటే నారాయణవనం రైల్వే గేటు- మరాఠీ రైల్వే గేట్ల మధ్య ఈ కొత్త రైల్వే లైను తిరుగుతుందని పేర్కొన్నారు. ఈ రైల్వే మార్గంలో 15 మేజర్.. 159 మైనర్ వంతెనలు ఉంటాయని ప్రతిపాదించారు. ప్రతిరోజు ప్రయాణికుల కోసం ఆరు బోగీలు వుండే నాలుగు ఈఎంయులు నాలుగు ట్రిప్పులు తిరగనున్నాయి. ఈ విద్యుత్ రైళ్లు ఇటు పుత్తూరు- చెన్నై, అటు సూళ్లూరుపేట-చెన్నై లైన్లలో కలుస్తాయి. దీంతో శ్రీసిటీ వెళ్లే ఉద్యోగులు, చెన్నై, పుత్తూరు వెళ్లే వ్యాపారులకు అనుకూలంగా ఉంటుంది.

ప్రాజెక్టు ఉద్దేశం

ఈ విద్యుత్‌లైన్ వల్ల ప్రధానంగా బళ్లారి నుంచి ఎగుమతయ్యే ఇనుపఖనిజం, దిగుమతయ్యే బొగ్గు రవాణాకు ఉపయోగమౌతుందని ప్రతిపాదించారు. చెన్నై ఓడరేవు మీద పెరిగిన ఒత్తిడిని తగ్గించేందుకు అట్టిపట్టు సమీపంలోని ఎన్నూరు ఓడరేవును ఎంచుకుని ఈ రైలు మార్గంను ప్రతిపాదించారు.

తిరువళ్లూరు- పెరియపాలెం రెండో విద్యుత్ లైన్

పుత్తూరు-అట్టిపట్టు లైను ప్రాజెక్టు ప్రతిపాదనలోనే తిరువళ్లూరు-పెరియపాలెం మధ్య 28.30 కిలోమీటర్ల మరో చిన్న లైనును అధికారులు ప్రతిపాదించారు. పూర్తిగా తమిళనాడులోనే వెళ్లే ఈ మార్గంలో కలింబాకం, మేల్‌కొండయార్, వెంగల్ వంటి మూడు స్టేషన్లను ప్రతిపాదించారు. ఈ రూట్‌లోనూ ప్రయాణికుల కోసం నాలుగు ట్రిప్పులు విద్యుత్ రైళ్లు తిరుగుతాయి.

టీటీడీలో తవ్వేకొద్దీ బయటపడుతున్న అక్రమాలు

విదేశీ కల్యాణోత్సవాల్లోనూ అందినవరకు దోచుకున్న అధికారి

తిరుమల, జనవరి3(ఆంధ్రజ్యోతి): టీటీడీలో తవ్వేకొద్దీ అక్రమాలు బయటపడుతున్నాయి. తాజాగా.. విదేశాల్లో టీటీడీ నిర్వహించిన కల్యాణోత్సవాల్లో ఏఈవో స్థాయి అధికారి ఒకరు అందినవరకు దోచుకున్న విషయం వెలుగుచూసింది. సనాతన హిందూ ధర్మప్రచారంలో భాగంగా టీటీడీ కొన్నేళ్లుగా విదేశాల్లో శ్రీవారి కల్యాణోత్సవాలు నిర్వహిస్తోంది. యూకే, యూరప్‌లో కల్యాణోత్సవాలు నిర్వహించాలని యుక్తా అనే ఛారిటీ టీటీడీని కోరింది. 2022 అక్టోబరు, నవంబరు నెలల్లో కల్యాణోత్సవాలను నిర్వహించేందుకు టీటీడీ ఏఈవో(కంప్యూటర్స్) వెంకటేశ్వర్లుతో పాటు మరో శ్రీధర్ పూజారికి బాధ్యతలు అప్పగించారు. కల్యాణోత్సవాలు పూర్తిచేసుకుని వచ్చిన కొన్ని నెలల తర్వాత యుక్తా చారిటీ చైర్మన్ సత్యప్రసాద్ కిల్లి నుంచి టీటీడీకి 2023 ఆగస్టు9న ఓ లేఖ అందింది. అందులో వేదపండితులుగా పంపిన వ్యక్తులు సహకరించలేదని, కంప్యూటర్స్ ఏఈవో అహంకారపూరితంగా ప్రవర్తించారని, వారి ఖర్చు మొత్తం చెల్లించినప్పటికీ ఎక్కువ డిమాండ్ చేసినట్టు ఆ లేఖలో పేర్కొన్నారు. దీనిపై విచారించిన విజిలెన్స్ అధికారులు.. అక్రమం జరిగినట్టు 2024 జూన్ నెలలో నిర్ధారించారు. సంభావన పేరుతో రూ.27.08 లక్షలు పొందినట్టు తేల్చారు. ఇందులో వెంకటేశ్వర్లు దాదాపు రూ.5.26 లక్షలు తీసుకున్నట్టు నివేదికలో పేర్కొన్నారు. వీరిపై ఎలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోకపోవడంతో చిన్నపాటి మందలింపుతో సరిపెట్టిన క్రమంలో గత నెల 24వ తేదీన జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ప్రస్తావించారు.

తప్పుచేస్తే ఏస్థాయి అధికారికైనా శిక్ష తప్పదు

గత ప్రభుత్వంలో భారీస్థాయిలో అవినీతి అక్రమాలు జరిగాయి. వీటిపై నా దగ్గర ఆధారాలున్నాయి. తప్పుచేసినవారు ఏ స్థాయి అధికారైనా శిక్ష పడాల్సిందే. వీరిని మా బోర్డు విడిచిపెట్టదు. **- భానుప్రకాష్‌రెడ్డి, సభ్యుడు**

మంగళంలో నకిలీ సర్వే ముఠా

తిరుపతి అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మంగళంలో శుక్రవారం ఆరుగురితో కూడిన నకిలీ సర్వే ముఠా హల్‌చల్ చేసింది. హైదరాబాదు కేంద్రంగా 360 మీడియా ఛానల్‌కు చెందిన వాళ్లమంటూ మంగళం-2 సచివాలయ పరిధిలోని చంద్రబాబునాయుడు కాలనీలో ప్రజల నుంచి వ్యక్తిగత సమాచారం సేకరించారు. స్థానిక టీడీపీ నాయకులు అనుమానంతో ప్రశ్నించారు. గుర్తింపు కార్డు చూపాలని నిలదీశారు. పొంతన లేని సమాధానం చెబుతుండడంతో తిరుచానూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వీరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. హరియాణా రాష్ట్రంలోని గుర్గావ్‌లో తమ కేంద్ర కార్యాలయం ఉందని చెప్పారు. వీరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రెండు పూటలా

ఫింగర్ పడితేనే వేతనం

● సచివాలయ ఉద్యోగుల హాజరు నమోదులో మార్పులు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఇక,సచివాలయ ఉద్యోగులు రెండు పూటల బయోమెట్రిక్ హాజరు వేస్తేనే ఆ రోజుకు వేతనం ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లాలోని 691 సచివాలయాల పరిధిలో 5,489మంది ఉద్యోగులకు ఇది వర్తిస్తుంది. కొన్ని సచివాలయాల్లో సకాలంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై ప్రభుత్వానికి వరుస ఫిర్యాదులు అందాయి. వీటిపై కూటమి ప్రభుత్వం మార్పులు, చేర్పులు చేసి కొత్త జీవో తీసుకువచ్చింది, పౌర సేలకు ఇబ్బందులు కలగకుండా ఉండేలా చర్యలు తీసుకుంది. పౌరులకు సత్వర పారదర్శక, నాణ్యమైన సేవలు అందించేందుకే రెండుపూటలా బయోమెట్రిక్ హాజరును ప్రభుత్వం తప్పనిసరి చేసినట్లు డీఎల్‌డీవో నారాయణరెడ్డి తెలిపారు. ప్రతిపథకంలో సచివాలయ ఉద్యోగుల పాత కీలకంగా మారిందని పేర్కొన్నారు.

జిల్లాకు 24 కొత్త ఆర్టీసీ బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని వివిధ డిపోలకు 24 కొత్త ఆర్టీసీ బస్సులు వచ్చాయి. శుక్రవారం మంగళం డిపో పరిధిలోని గ్యారేజీకి చేరుకున్నాయి. కాలం చెల్లిన బస్సుల స్థానంలో వాటిని నడపనున్నారు. రహదారి అనుమతి, రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికాగానే రోడ్డెక్కనున్నాయి. ఇందులో మంగళం డిపోకు సూపర్‌లగ్జరి 1, గూడూరు డిపోకు 4 ఎక్స్‌ప్రెస్‌లు, వెంకటగిరి డిపోకు 4 చొప్పున ఎక్స్‌ప్రెస్‌లు, సూపర్ లగ్జరీలు, వాకాడు డిపోకు 5 ఎక్స్‌ప్రెస్ బస్సులున్నాయి. అదనంగా ఆరు అద్దె బస్సులు కూడా వచ్చాయి.

రెవెన్యూ సదస్సులకు 472 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం జరిగిన 35 గ్రామ సభల్లో 472 అర్జీలు అందాయి. వీటిలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.

గిరిజన మహిళలకు

వైసీపీ ఎంపీపీ టోకరా

● గ్రూపు రుణాలు తీసుకుని పరార్

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన మహిళల పేరిట రుణాలు తీసుకుని ఎంపీపీ మోసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బీఎన్‌కండ్రిగ పంచాయతీ లక్ష్మీపురం గిరిజన కాలనీకి చెందిన బాధితులు శుక్రవారం పోలీసుస్టేషన్ ఎదుట నిరసన చేపట్టి ఎస్‌ఐ విశ్వనాథ నాయుడికి ఫిర్యాదు చేశారు. 'మా కాలనీలోని 50 మందికి పైగా మహిళలం పది సంవత్సరాలుగా గ్రూపులు ఏర్పాటు చేసుకుని వివిధ ప్రైవేటు బ్యాంకుల్లో రుణాలు తీసుకుని సక్రమంగా చెల్లించేవాళ్లం. కాలనీలో ఉన్న ఐదు గ్రూపుల్లో ఉన్న మహిళలతో పాటు ఎంపీపీ సుబ్బలక్ష్మి ప్రతి గ్రూపులో సభ్యురాలిగా చేరి ఐదు బ్యాంకుల్లో ఆరు నెలల కిందట రూ.60వేల చొప్పున రుణం పొందారు. ఈ రుణానికి ప్రతి నెలా రూ.3600 చొప్పున ఐదు బ్యాంకులకు కలిపి రూ.18వేలు గ్రూపు సభ్యులతో పాటు ఆమె చెల్లించాలి. కానీ రుణం తీసుకున్న నాటి నుంచి బ్యాంకులకు ఒక్క నెల కంతు కూడా చెల్లించలేదు. ఎంపీపీతో మాకు పనిలేదని, గ్రూపు సభ్యులందరు రుణం చెల్లించాలని బ్యాంకు సిబ్బంది ఒత్తిడి చేస్తున్నారన్నారు. రుణం చెల్లించాలని మేము అడిగితే సుబ్బలక్ష్మి తన భర్తతో ఇల్లు వదిలి వెళ్లిపోయారు' అని బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. ఎంపీపీ తీసుకున్న రుణాన్ని మూడు నెలల నుంచి తామే చెల్లిస్తున్నట్టు వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరారు.



పుత్తూరు వార్తలు

పుత్తూరులో అమృత్ 2.0 పథకం

రూ.13 కోట్లు మంజూరు ● నిర్మాణ పనులకు త్వరలో టెండర్లు

పుత్తూరు అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజల తాగునీటి సమస్య అమృత్ 2.0 పథకం ఆధ్వర్యంలో పరిష్కారం కానుంది. పట్టణాల అభివృద్ధికి తాగునీటి సరఫరా మెరుగు పర్చడమే ప్రధానాంశంగా కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకాన్ని రూపొంచింది. ఈ మేరకు పుత్తూరు పట్టణంలో మంచినీటి సరఫరా మెరుగుకు ప్రణాళికలు రూపొందించారు. ప్రజలకు రక్షిత మంచినీటి సరఫరాకు అమృత్ నిధులు రూ.13 కోట్లు మంజూరయ్యాయని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా 2 గ్రౌండ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్‌ల నిర్మాణం చేపట్టడమేకాకుండా, వెనుకబడిన ప్రాంతాల్లో ప్రతి ఇంటికి ఉచితంగా నీటి కనెక్షన్ ఇస్తామని చెప్పారు. ఈ మేరకు నెల రోజుల్లో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కల్యాణపురం వద్ద 7 ఎంఎల్‌డీ సామర్థ్యంతో జీఎల్ఆర్ఎస్ ట్యాంక్‌ను నిర్మించనున్నారు. అలాగే నందిమంగళం, కల్యాణపురం ప్రాంతాల్లో ఉచిత నీటి కొళాయిలు ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ పనులను పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షిస్తుంది.

పుత్తూరు సీడీపీవో సెలవు పొడిగింపు

పుత్తూరు అర్బన్, జనవరి 03(ఆంధ్రజ్యోతి): పుత్తూరు సీడీపీవో సెలవు మరో నెలరోజులు పొడిగించుకున్నట్లు ఇన్‌చార్జి సూపర్‌వైజర్ సంధ్య తెలిపారు. అనారోగ్య కారణంగా అక్టోబర్ నుంచి సీడీపీవో పద్మజ సెలవులో ఉన్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 31 వరకు సెలవు పెట్టినప్పటికీ అనారోగ్య కారణంగా మరో నెల రోజులు పొడిగించినట్లు వివరించారు. ఈ నాలుగు నెలలకు వేతనం, ఇతర అలవెన్సులు లేకుండా జిల్లా ఉన్నతాధికారులు సెలవు మంజూరు చేశారన్నారు. పుత్తూరు, వడమాలపేట మండలాల్లో ఖాళీగా ఉన్న 12 అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు ఇప్పటి వరకు 13 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ నెల 6వ తేదీతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియనుంది

బాలికా విద్యకు సావిత్రిబాయి పూలే స్ఫూర్తి

పుత్తూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలే స్ఫూర్తితోనే బాలికా విద్యా శాతం పెరిగిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. సావిత్రిబాయి జయంతి సందర్భంగా శుక్రవారం ఆమెకు నివాళి అర్పించి మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని కళాశాలలో ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ రంగంలో పురుషుల కంటే మహిళలు అధికంగా ఉన్నారన్నారు.

జేసీ ఆకస్మిక తనిఖీ

పుత్తూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, నిర్మాణంలో వున్న అన్న క్యాంటీన్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. పుత్తూరు పట్టణంలోని సర్వే నెం.302 భూ వివరాలను ఆ రెండు కార్యాలయాల అధికారులను విచారించారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పక్కనే శివాలయం కోనేరు స్థలంలో నిర్మాణంలో వున్న అన్న క్యాంటీన్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సబ్‌రిజిస్ట్రార్ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదాల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు


సమావేశంలో మాట్లాడుతున్న ధనంజయులు నాయుడు

వడమాలపేట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో భూ వివాదాల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు చెప్పారు. శుక్రవారం సీతారామపురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ... రైతుల భూములకు భద్రత కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తోందని చెప్పారు. సదస్సులో తహసీల్దార్ జరీనా, టీడీపీ నాయకులు దేవరాజులు నాయుడు, సోమశేఖర్ రెడ్డి, గోపాల్ నాయుడు, పార్థసారథి నాయుడు, తిరుమల నాయుడు, హరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్‌గా వీరాస్వామి

వడమాలపేట, జనవరి 3(ఆంధ్రజ్యోతి):ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షల నిర్వహణ, నిర్ణీత సమయంలోలో ఫలితాల చేరవేతలో ప్రతిభ చూపిన వీరాస్వామి జిల్లాస్థాయిలో ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్‌గా అవార్డు అందుకున్నారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బాలకృష్ణ నాయక్ అవార్డును అందజేశారు. వీరాస్వామిని డాక్టర్లు చక్రపాణి, భానురెడ్డి, సీహెచ్‌సీ పురుషోత్తంరెడ్డి, సూపరవైజర్ చంద్రమోహన్ అభినందించారు.

ప్రణాళికాబద్ధంగా పని చేయండి

పుత్తూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల సహకారంతో ప్రణాళికాబద్ధంగా పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని స్టేట్ అబ్జర్వర్ డాక్టర్ పెంచలయ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ప్రభుత్వ పాఠశాలలో రెండు రోజుల పాటు మండలంలోని యాజమాన్య కమిటీ ఛైర్మన్లు, ప్రధానోపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం జరిగింది. మధ్యాహ్న భోజనం నాసిరకంగా ఉందని కమిటీ ఛైర్మన్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంవో సురేష్, ఎంఈఓలు, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు

పుత్తూరు టౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సెంగుందర్ వీధిలో మొదటల్లో ధ్వంసమైన సిమెంటు రోడ్డుకు స్థానిక డాక్టర్ ఇ.మునిరాజా మరమ్మతులు చేయించారు. ధ్వంసమైన రోడ్డులో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడేవారు. గుర్తించిన డాక్టర్ ఈమేరకు చర్యలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


చిరంజీవులు మృతదేహం

వడమాలపేట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్‌వీపురం పంచాయతీ గుట్టకింద మాదిగవాడకు చెందిన చిరంజీవులు(40) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శుక్రవారం వడమాలపేట బైపాస్ రోడ్డులో ప్రమాదం జరిగింది. తిరుమల అన్నదానం క్యాంటీన్‌లో విధులు నిర్వహిస్తున్న చిరంజీవులు తిరుపతి నుంచి వడమాలపేటకు బైక్‌పై వస్తుండగా ప్రమాదవశాత్తు అదవు తప్పి బోల్తా పడి అక్కడిక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధర్మారెడ్డి చెప్పారు.

తిరుమల నుంచి వెళ్తూ...

తమిళనాడు రాష్ట్ర తిరువళ్లూరు జిల్లా పెరంబూరుకు చెందిన కార్తిక్, గౌతం తిరుమల శ్రీవారిని దర్శించుకుని శుక్రవారం సాయంత్ర బైక్‌లో తిరుగు ప్రయాణమయ్యారు. ఈక్రమంలో మార్గమధ్యంలోని వడమాలపేట బైపాస్ రోడ్డులో లారీని అధిగమించే క్రమంలో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో కార్తిక్ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ గౌతంను రుయా ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ ధర్మారెడ్డి చెప్పారు.

గ్రావెల్ టిప్పర్లను అడ్డుకున్న టీడీపీ నేతలు


టిప్పర్‌ను అడ్డుకున్న టీడీపీ నేతలు

సత్యవేడు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసుకుప్పం మీదుగా తమిళనాడుకు గ్రావెల్‌ను తరలిస్తున్న టిప్పర్లను గ్రామానికి చెందిన టీడీపీ నేతలు అడ్డుకున్నారు. ఆంబాకం నుంచి తమిళనాడుకు గ్రావెల్‌ను తరలిస్తున్నారన్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు శుక్రవారం సాయంత్రం టీడీపీ సీనియర్ నాయకుడు లోకయ్యరెడ్డి ఆధ్వర్యంలో చెన్నేరి సమీపంలో టిప్పర్లను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ మండలంలోని అభివృద్ధి పనులకు వినియోగించాల్సిన గ్రావెల్‌ను నిబంధనలకు విరుద్ధంగా తమిళనాడుకు తరలించడం ఏమిటని ప్రశ్నించారు. గ్రావెల్ రవాణా కోసం పొందిన అనుమతుల విషయంలో కూడా గందరగోళం నెలకొని ఉందని వివరించారు. గ్రావెల్‌ను తమిళనాడుకు తరలిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో జగన్నాథం, మాతయ్య, జగన్, రామ్మూర్తి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

గూడూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం చర్చివీధికి చెందిన సుకుమార్ అనే బాధితుడికి రూ.59వేలు సీఎం సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న వారికి ఆర్థిక సహకారాన్ని అందించేలా సీఎం సహాయనిధి ద్వారా ఆదుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వర ఆలయంలో హుండీ చోరీ

తడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బోడిలింగాలపాడు వద్ద ఉన్న భువనేశ్వరస్వామి ఆలయ హుండీలో నగదు చోరీకి గురైంది. గురువారం సాయంత్రం సమయంలో పూజారి చంద్రమౌళి ఆలయానికి తాళాలువేసి ఇంటికి వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయం ఆలయానికి రాగా హుండీని పగులగొట్టి ఉండటాన్ని గుర్తించాడు. చోరీ జరిగినట్లుగా నిర్ధారించుకున్నాడు. సుమారు రూ.8వేల వరకు భక్తులు సమర్పించిన నగదు ఉండవచ్చని పూజారితెలిపారు. పోలీసులకు ఫిర్యాదు అందాల్సి ఉంది.

అసభ్యప్రవర్తనపై విచారణ

చిల్లకూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉడతావారిపాళెం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థిని పట్ల ఓ ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించారని అందిన ఫిర్యాదు మేరకు శుక్రవారం డిప్యూటీ ఈవో సనత్‌కుమార్ విచారణ నిర్వహించారు. డిప్యూటీ ఈవో మాట్లాడుతూ విద్యార్థిని పట్ల ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించాడని తన దృష్టికి రావడంతో పాఠశాలలో విచారణ నిర్వహించామన్నారు. నివేదికలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

మార్టులు.. దాబాలపై కేసు నమోదు

కోట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్, కోటలోని పలు మార్టులు, దాబాలపై కేసులు నమోదైనట్లు ఫుడ్‌సేఫ్టీ అధికారులు శుక్రవారం తెలిపారు. కోటలోని ఓ మార్ట్, విద్యానగర్‌లోని రెండు డాబాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంకటేశ్వరరావు, నర్మద గురువారం దాడులు జరిపి శాంపిల్స్ తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. విద్యానగర్‌లోని రెండు దాబాలు, మెస్, బేకరికి నోటీసులిచ్చినట్లు తెలిపారు. కోటలోని ఒక మార్ట్‌పై కేసు నమోదు చేసినట్లు ఫుడ్‌సేఫ్టీ అధికారులు తెలిపారు.

రెడ్డిపాళెం పాఠశాలలో పారిశుధ్య పనులు

వాకాడు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాళెం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం టీడీపీ నాయకులు మల్లాపు వెంకటాద్రి, మల్లాపు ప్రదీప్ సౌజన్యంతో పారిశుధ్య పనులు చేపట్టారు. పాఠశాల ఆవరణంలో పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా జాగ్రత్తలు సూచించారు.

పాఠశాల అభివృద్ధిలో విద్యాకమిటీలే కీలకం

డక్కిలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో విద్యాకమిటీలు కీలకంగా వ్యవహరించాలని ఎంఈవో జగదీష్ బాబు అన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీ హైస్కూల్లో విద్యాకమిటీలు, ఉపాధ్యాయుల శిక్షణా తరగతులు ముగిశాయి. అనంతరం అక్కడే మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మౌలిక వసతుల రూపకల్పన, విద్యాభివృద్ధి, పాఠశాల అభివృద్ధి, మధ్యాహ్న భోజన వసతి తదితర అంశాల్లో ఉపాధ్యాయులు, పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్, సభ్యులు కీలకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, విద్యాకమిటీ ఛైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

వేణుంబాక చిరస్మరణీయుడు

కోట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడులో శుక్రవారం మాజీ సర్పంచ్, ఎంపీటీసీ వేణుంబాక సాయికోటారెడ్డి 9వ వర్ధంతిని టీడీపీ నాయకులు జరుపుకున్నారు. సాయికోటారెడ్డి చిత్రపటం వద్ద ఆయన కుటుంబసభ్యులతో పాటు టీడీపీ నాయకులు బందిల రఘురామ్, పుచ్చలపల్లి సుధాకర్‌రెడ్డి, కృష్ణ, బాలసుబ్రహ్మణ్యం తదితరులు నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు. పేదలకు అన్నదానం చేశారు.

మానసిక వికలాంగులకు కిట్ల పంపిణీ

డక్కిలి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలో అంధత్వం కలిగిన విద్యార్థులు, మానసిక వికలాంగులకు బ్రెయిలీ కిట్లు, 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు వినికిడి యంత్రాలను శుక్రవారం పంపిణీ చేసినట్లు భవిత ఉపాధ్యాయురాలు బి.కిష్మసౌమ్య తెలిపారు. ఆమె మాట్లాడుతూ మానసిక వికలాంగులకు డక్కిలి భవిత పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పిస్తున్నట్లు తెలిపారు. 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు భవిత ఆధ్వర్యంలో ఉచితంగా వినికిడి యంత్రాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

108 సిబ్బందికి సత్వరమే వేతనాలు పెంచాలి


మంత్రి సత్యకుమార్‌ను సత్కరిస్తున్న కిరణ్‌కుమార్

నాయుడుపేట టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేర సత్వరమే వేతనాలు రూ.4వేలు పెంచాలని ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్‌ను నాయుడుపేటకు చెందిన 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బల్లి కిరణ్‌కుమార్ కోరినట్లు తెలిపారు. శుక్రవారం అమరావతిలో మంత్రిని కలసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ప్రమాదాలు జరగకుండా నివారించాలి

పెళ్లకూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పెన్నేపల్లిలోని ఎంఎస్ అగర్వాల్ స్టీల్ ఫ్యాక్టరీలో బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం జరగడం బాధాకరమని, ఇకపై ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు ఎల్.లక్ష్మీరెడ్డి, రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సునీత, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లయ్య జిల్లా కార్యదర్శి మునిరాజా డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంఎస్ అగర్వాల్ స్టీల్ ఫ్యాక్టరీలో ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి కార్మికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ ప్రమాదంలో మృతిచెందిన సిపాయిలాల్ కుటుంబానికి రూ.కోటి, గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించడంతో పాటు రూ.లక్ష చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ప్రమాద సంఘటనపై విచారణచేసి సంబంధిత అధికారులతో పాటు యాజమాన్యంపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ముకుంద, రాధాకృష్ణ, నాగేంద్ర, సుధాకర్ రెడ్డి, ఏఐఎఫ్‌టీయూ కార్యవర్గ సభ్యులు వీవీ రమణయ్య, చాపల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాడాలి

● ఎమ్మెల్యే విజయశ్రీ


కలెక్టర్ వెంకటేశ్వర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల తదితరులు

నాయుడుపేట/సూళ్లూరుపేట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాడాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. శుక్రవారం శ్రీకాళహస్తిలో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మాజీ ఎంపీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి మాట్లాడారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో వట్రపాలెం చిన్నపాటి వర్షమొచ్చినా ముంపునకు గురవుతుందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనికి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. నాయుడుపేట మండలంలోని కమ్మవారిపాళెంకు రూ.5 కోట్లతో రోడ్డు, చిగురుపాడుకు రూ.2 కోట్లతో సిమెంట్ రోడ్లు అవసరమవుతాయన్నారు. అలాగే ఫ్లెమింగో ఫెస్టివల్ తేదీలను ఖరారు చేయాలని వారు కోరారు. వీరి వెంట పెళ్లకూరు మండల టీడీపీ అధ్యక్షులు సంచి కృష్ణయ్య ఉన్నారు.

మహిళా విద్య ప్రోత్సాహానికి సావిత్రిబాయిపూలే కృషి


సావిత్రిబాయి జ్యోతిరావ్ పూలే దంపతుల విగ్రహాలకు గూడూరులో సీపీఎం నాయకులు, నాయుడుపేటలో జువ్వలపాటి తదితరుల నివాళులు

గూడూరు అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో మహిళలను విద్యలో ప్రోత్సహించేందుకు సావిత్రిబాయిపూలే ఎనలేని కృషిచేశారని సీపీఎం నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్ అండ్‌బీ కార్యాలయ సమీపంలోని జ్యోతిరావ్‌పూలే దంపతుల విగ్రహాలకు సీపీఎం ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా నివాళులర్పించారు. శివకుమార్, శ్రీనివాసులు, సురేష్, బీవీ రమణయ్య, మణి, ప్రసాద్, భాస్కర్‌గౌడ్, చంద్రయ్య పాల్గొన్నారు.

సూళ్లూరుపేట(ఆంధ్రజ్యోతి):సూళ్లూరుపేట వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, మూమెంట్ 21 ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులు అర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మహిళా అధ్యాపకులను సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్‌శర్మ, సీడీపీవో శారదాంబ, వైస్‌ప్రిన్సిపాల్ విక్టోరియారాణి, మూమెంట్21 జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తడ (ఆంధ్రజ్యోతి): పాములమిట్ట ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం ఉస్మాన్‌బాషా, కాశింగాడుకుప్పం ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం రఘురామయ్య, కొత్తకుప్పం గ్రామంలో హెచ్‌ఎం సుధాకర్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. విద్యావ్యవస్థకు ఆమె చేసిన కృషిని కొనియాడారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాయుడుపేట (ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలే నిరక్షరాస్యురాలైనప్పటికీ భర్త జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో విద్యాభ్యాసం చేశారని బీసీ సంఘ సూళ్లూరుపేట నియోజకవర్గ అధ్యక్షుడు జువ్వలపాటి మస్తాన్ అన్నారు. శుక్రవారం నాయుడుపేట బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన జ్యోతిరావు పూలే - సావిత్రిబాయి పూలే విగ్రహాలకు బీసీ సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీసీ సంఘ నాయకులు ఎం.బాలాజీ, ఈ.ప్రతాప్, వి.శివకుమార్, షరీఫ్, సులేమాన్, ఎ.వినోద్, మునిశేఖర్, హైదర్‌ఆలీ, ప్రసాద్, హరీష్, ముని తదితరులు ఉన్నారు.

కోట (ఆంధ్రజ్యోతి): కోటలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకులంలో బీసీ గురుకులాల జిల్లా కన్వీనర్ నారాయణరావు ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించి స్వీట్‌లు పంపణీ చేశారు.అదే విధంగా విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలోనూ, వెంకన్నపాళెంలో రజక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

మహిళా వికాసానికి బాటలు వేసిన ధీరవనిత


సావిత్రిబాయికి నివాళులర్పిస్తున్న టీడీపీ బీసీ విభాగం నాయకులు - సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం

సావిత్రిబాయి పూలేకు నివాళులు

శ్రీకాళహస్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త, తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను టీడీపీ బీసీ విభాగం నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పూసల వీధి కూడలిలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమవుతుందని నమ్మిన వ్యక్తి సావిత్రిబాయి అన్నారు. రాష్ట్ర వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, ఉమేష్‌రావు, ఎస్.బుజ్జి, రామచంద్రయ్య, మణి, కోట చంద్రశేఖర్, మునిరాజా యాదవ్, చాంద్‌బాషా, మహమ్మద్, జయశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు: మహిళలకు విద్యతో పాటు సమాన హక్కుల కోసం బాటలు వేసిన ధీర వనిత సావిత్రిబాయి పూలే అని ఎమ్మెల్యే ఆదిమూలం కొనియాడారు. సత్యవేడులోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో సావిత్రిబాయి జయంతి వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సావిత్రిబాయి తన భర్త జ్యోతిబా అడుగు జాడల్లో నడుస్తూ సమసమాజ స్థాపన, అణగారిన వర్గాల అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో రవి, నాయకులు చిన్న, బాల, అరుల్, వెంకటరమణ, ఛైర్మన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం: పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో సావిత్రిబాయి జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె సేవలను కొనియాడారు.

రేణిగుంట: పట్టణంలోని పాంచాలినగర్‌లో ఉన్న బాలికల పాఠశాలలో సావిత్రిబాయి జయంతి వేడుకలు జేవీవీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధనం పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని మన్నసముద్రం ప్రభుత్వ పాఠశాల, పాపానాయుడుపేట జూనియర్ కళాశాలల్లో సావిత్రిబాయి జయంతి వేడుకలను నిర్వహించారు.

పానీ పూరి బండి ధ్వంసం

డబ్బులు ఇవ్వమని అడిగినందుకు యువకుడి వీరంగం

శ్రీకాళహస్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పానీపూరి తిన్న డబ్బులు చెల్లించమని అడిగినందుకు యువకుడు రెచ్చిపోయాడు. వలసజీవిపై దాష్టీకాన్ని ప్రదర్శించాడు. బూతు పదజాలంతో ఇష్టానుసారంగా తిట్టడమే కాకుండా బతుకుదెరువు అయిన బండిని విచక్షణా ధ్వంసం చేశాడు. ఈ ఘటన దక్షిణకైలాసనగర్ కాలనీలో శుక్రవారం సాయంత్రం జరిగింది. పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన ప్రదీప్ గత 12ఏళ్లగా దక్షిణకైలాసనగరకాలనీలో సీపీఎం కార్యాలయం పానీపూరి బండి పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. నాగలాపురం ప్రాంతానికి చెందిన తులసీతేజ్ శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానం ఎదురుగా ప్రాంతంలో స్థిరపడ్డాడు. ప్రైవేటు డ్రైవర్‌గాతులసీతేజ్ జీవనం సాగిస్తుంటాడు. ప్రదీప్ వద్ద పానీపూరి తినేవాడు. ఇలా రూ.2వేల వరకు ప్రదీప్‌కు బాకీ పెట్టాడు. అప్పు అడిగితే దుర్భాషలాడేవాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం తులసీతేజ్ పానీపూరి తిని డబ్బులు ఇవ్వకపోగా బండిని తోసేసి వెళ్లిపోయాడు. స్థానికుల ఫిర్యాదులో రెండో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. బండిని ధ్వంసం చేసిన యువకుడిపై కేసు నమోదు చేశారు.

మసీదు నూతన కమిటీ నియామకం



నాగలాపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి):మండలంలోని టీపీకోట బర్కతుల్ ముబారక్ మదీన మసీద్ కమిటీని గ్రామస్తులు శుక్రవారం ఎన్నుకున్నారు. మసీదు ముత్తవల్లిగా ఎస్.మహ్మద్ అలీ, వైస్ ముత్తవల్లిగా పి.బషీర్, సెక్రటరీగా ఎస్.ఈసుబ్, జాయింట్ సెక్రటరీగా ఎం.షఫీవుల్లా, ట్రెజరర్‌గా ఎస్.కే.షమీవుల్లా, కన్వీనర్‌గా కె.షరీఫ్, ఆర్గనైజర్‌గా జి. ఖమురుద్దీన్, సభ్యులు ఎన్నికయ్యారు. నూతన కమిటీకి మాజీ ముత్తవల్లి షాబుద్దీన్ శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

శ్రీకాళహస్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడ్డాడు. వడమాలపేటకు చెందిన యోగి సొంత పనుల నిమిత్తం శుక్రవారం శ్రీకాళహస్తికి వచ్చాడు. శ్రీరామ్‌నగర్‌కాలనీ వద్ద బైపాస్‌రోడ్డులో స్పీడ్‌బ్రేకర్‌పై గుర్తులు లేకపోవడంతో బస్సు సడన్ బ్రేక్ వేయడంతో ఆగింది. వెనుక ద్విచక్ర వాహనం అదుపు తప్పి బస్సును ఢీకొనడంతో యోగి గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రైవేటు వైద్యశాలకు క్షతగాత్రుని తరలించారు. శ్రీకాళహస్తి 1 టౌన్ పోలీసులు ఘటనపై విచారణ చేస్తున్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠినచర్యలు

వెంకటగిరిటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గూడూరు డీఎస్పీ వీవీ రమణకుమార్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కోడి పందేలు, పేకాట నిషేధమని, వాటిని నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ ఏవీ రమణ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం

శ్రీకాళహస్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఘనంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ దీనదయాల్, అధ్యాపకులు మాలతి గాబ్రియేల్ తదితరులు పాల్గొన్నారు.

అమృతకు సావిత్రిబాయి పూలే అవార్డు ప్రదానం

వరదయ్యపాలెం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతవేలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు అమృతకు సావిత్రిబాయి పూలే ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు దక్కింది. తిరుపతిలోని ఎస్వీ సెనేట్ హాల్‌లో శుక్రవారం సావిత్రిబాయి జయంతిని పురస్కరించుకుని విశ్రాంత ఐఏఎస్ అధికారి దాసరి శ్రీనివాసులు, ఎస్వీయూ వీసీ అప్పారావు చేతుల మీదుగా అవార్డును అమృత అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాదవయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా బాబు


బాబును సన్మానిస్తున్న కండ్రిగ ఉమ

కేవీబీపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా నాలి బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి కండ్రిగ ఉమ తెలిపారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ... తనపై నమ్మకంతో పార్టీ బాధ్యతలు అప్పగించిన బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు మునిశేఖర్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపి పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రామచంద్రరాజు, వెంటకయ్య, సిద్ధులయ్య, మునిరాజా, చందు, భాను, సూర్య పాల్గొన్నారు.

తెలుగుగంగ ఈఈకి సన్మానం



శ్రీకాళహస్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రత్నారెడ్డిని శుక్రవారం టీడీపీ తొట్టంబేడు మండల అధ్యక్షుడు మురళీనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రత్నారెడ్డి సూళ్ళూరుపేట డివిజన్ నుంచి బదిలీపై శ్రీకాళహస్తిలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి ముక్కంటి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణరెడ్డి, గుణశేఖర్, వేణు, కృష్ణయ్య, చెంచయ్య, దేశయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలు అవసరం: కలెక్టర్




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్ - నమూనాను పరిశీలిస్తున్న కలెక్టర్



విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

శ్రీకాళహస్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ఉత్పాదకతను పెంచుకునేందుకు దోహదపడే విధంగా ఆవిష్కరణలు ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నూతన ఆవిష్కరణల కోసం పరిశోధనలు అవసర మన్నారు. విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వాన్ని ప్రోత్సహించాలని చెప్పారు. వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలు సమాజ హితం కోసం ఉండాలన్నారు. విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని పెంచేందుకు తరచూ ఇలాంటి కార్యక్రమాలను పాఠశాల, మండల స్థాయిలో నిర్వహించాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించిన కలెక్టర్ ప్రదర్శనలు ఆలోచన రేకెత్తించేలా ఉన్నాయని అభినందించారు. తాను చదువుకునే రోజులను గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగినపుడే ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయని తెలిపారు. అనంతరం విద్యార్థి, వ్యక్తిగత, సామూహిక, ఉపాధ్యాయ విభాగాల్లో జిల్లాస్థాయి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విజేతలకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను ఆయన అందజేశారు. డీవైఈవో ప్రభాకరరాజు, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, భాస్కర్, హెచ్ఎం రాజేశ్వరి, కృష్ణయ్య, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.



కల్లివెట్టు పాఠశాల విద్యార్థులు తయారు చేసిన రాకెట్ నమూనా

అరణియార్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం: జేసీ



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జేసీ శుభం భన్సల్

పిచ్చాటూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా తీర్చి దిద్దుతామని జేసీ శుభం భన్సల్ అన్నారు. పిచ్చాటూరు అరణియార్ పర్యాటక అభివృద్ధి పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత రైతులకు అరణియార్ జలాశయం గొప్పవరం అన్నారు. ఎమ్మెల్యే ఆదిమూలం విజ్ఞప్తి మేరకు పిచ్చాటూరు జూనియర్ కాలేజీ ప్రహరీ, అదనపు తరగతి గదులు నిర్మిస్తామన్నారు. అలాగే బాలికల వసతి గృహానికి రోడ్డు పనులకు నిధులు మంజూరు చేస్తామన్నారు. అరణియార్ ఆయకట్టు చైర్మన్ రవిరెడ్డి, నాయకులు పద్దురాజు, జయచంద్రనాయుడు, శ్రీనివాసులు(చిన్న), డిల్లీబాబు, తహసీల్దార్ రమేష్‌బాబు, ఆర్‌ఐ సుధాకర్, ఇరిగేషన్ ఏఈఈ లోకేశ్వర్‌రెడ్డి, వీఆర్వోలు కృష్ణ ప్రియాంక రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దాతృత్వం చాటుకున్న బొజ్జల బృందమ్మ



చరణ్‌ను అభినందిస్తున్న బృందమ్మ

శ్రీకాళహస్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ప్రతిభావంతుడైన కళాకారుడు, 7వ తరగతి విద్యార్థి పి.చరణ్ విద్యాభ్యాసానికి అయ్యే ఖర్చు తానే భరిస్తానని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ దాతృత్వాన్ని చాటుకున్నారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా మెగా సైన్స్ ప్రదర్శన జరిగింది. ఇందులో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రత్యేక ప్రతిభావంతుడైన చరణ్ శివ ధ్యాన నృత్యరూపకం సభికుల ప్రశంసలు అందుకుంది. అనంతరం ఆ విద్యార్థికి ప్రశంసాపత్రం, జాపిక, రూ.10వేలు సాయాన్ని అందజేశారు.

నేత్రపర్వం మనోన్మణి ఉత్సవం



శ్రీకాళహస్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం గొబ్బెమ్మ(మనోన్మణి) ఉత్సవాన్ని నిర్వహించారు. మొదట ఆలయ అలంకార మండపంలో గొబ్బిదేవతకు పలు రకాల అభిషేకాలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల మధ్య అమ్మవారిని చప్పరంపై అధిష్ఠించి పట్టణంలో ఊరేగించారు.

వేడుకగా పద్మావతమ్మ ఊయలసేవ

నారాయణవనం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు శుక్రవారం సందర్భంగా నిత్య కైంకర్యాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి ఊయలపై అధిష్ఠింపజేసి ఊంజల సేవ నిర్వహించారు.

కైలాసనాథుడి సేవలో జేసీ

నారాయణవనం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రం కైలాసనాథ కోనను జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ శుక్రవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జయరాములు, ఆలయ ఈవో కృష్ణ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం కామాక్షిదేవి సమేత కైలాసనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జలపాతాన్ని, టూరిజం, దేవదాయ శాఖ అతిథి గృహాలను ఆయన పరిశీలించారు.

కిశోర బాలికలతో సంఘాలు

శ్రీకాళహస్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలతో సంఘాలు ఏర్పాటు చేయడమే లక్ష్యమని ఎంపీడీవో సురేంద్రనాథ్ అన్నారు. తొట్టంబేడు ఎంపీడీవో కార్యాలయంలో మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఒకరోజు మండలస్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కిశోర వికాసం, ఆరోగ్యం, పోషణ, సంరక్షణ, విద్య, సాధికారత, లింగ సమానత్వం వంటి అంశాలపై వివరించారు. కిశోర సంఘాలు సమర్థవంతంగా పనిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సీడీపీవో శాంతిదుర్గ, ఎంఈవో భారతి, మెడికల్ ఆఫీసర్ తేజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, ఉష తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ఆక్రమణలను తొలగించండి

పిచ్చాటూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): దళితుల భూములకు వెళ్లే దారి ఆక్రమణకు గురైందని, రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. మండలంలోని ఓబుల్‌రాజు కండ్రిగ దళితులకు ప్రభుత్వం పంపిణీ చేసిన భూముల బాటను కొందరు భూ స్వాములు ఆక్రమించారని సీపీఎం సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి జనార్దన్ చెప్పారు. 2011లో గోవర్ధనగిరి గ్రామ సర్వే నెం.66,67లలో డీకేటీ పట్టాలు ఇవ్వడమేకాకుడా ఈ భూములకు 30 లింకుల బాటను కూడా ఏర్పాటు చేసిందని తెలిపారు. రామచంద్రారెడ్డి, నారాయణవనం మండల నాయకులు మునిశంకర్, ఓబుల్‌రాజు కండ్రిగ దళితులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం తనిఖీ



విద్యార్థులతో డీఈవో సహపంక్తి భోజనం

శ్రీకాళహస్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని డీఈవో కేవీఎన్ కుమార్ తనిఖీ చేశారు. స్వయంగా ఆయన విద్యార్థులకు వడ్డించారు. అనంతరం వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. పుత్తూరు డీవైఈవో ప్రభాకర రాజు, ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, హెచ్ఎం రాజేశ్వరి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో రాష్ట్ర ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్ చైర్మన్



ఆలయం వద్ద కేకే చౌదరి తదితరులు

శ్రీకాళహస్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శుక్రవారం రాష్ట్ర ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్ చైర్మన్ కేకే చౌదరి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. టీడీపీ నాయకులు రంగినేని చెంచయ్యనాయుడు, బాలాజీరెడ్డి, రవి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పొన్నాలమ్మ ఆలయంలో ధనుర్మాస పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పొన్నాలమ్మ ఆలయంలో శుక్రవారం ధనుర్మాస పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అర్చన, నైవేద్య, అఖండ హారతి సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

తిరుపతి

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

శ్రీకాళహస్తి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని దీన్ని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు మధుసూదన్‌రావు తెలిపారు. తొట్టంబేడు మండలంలోని చిట్టత్తూరులో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు రైతులు, ప్రజలు అర్జీలు అందజేశారు. శ్రీకాళహస్తి మండలంలోని అమ్మపాలెంలో తహసీల్దారు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది.

మేతబీడు భూములను రక్షించండి

సత్యవేడు: తమ గ్రామంలో మేతబీడు, చెరువు పోరంబోకు ఆక్రమణలను తొలగించాలని రైతులు వినతిపత్రం సమర్పించారు. మండలంలోని ఆంబాకం పంచాయతీ పేరడంలో శుక్రవారం డీటీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్వే నెం.218లోని 20 ఎకరాల మేతబీడును గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు ఆక్రమించుకున్నారని తెలిపారు. అదే విధంగా సర్వే నెం.191, 192లో ఉన్న రెడ్డిగుంట చెరువు పోరంబోకు భూముల్లో ఆక్రమణలను తొలగించాలని వినతిపత్రం సమర్పించారు. వీఆర్వో కలై వన్నన్, సర్వేయర్ చంద్రశేఖర్, సెక్రటరీ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చిట్టత్తూరులో జరిగిన రెవెన్యూ సదస్సు

వరదయ్యపాళెం: ప్రజల నుంచి అందే ప్రతి అర్జీనీ పరిష్కరిస్తామని తహసీల్దారు రాజశేఖర్ అన్నారు. మండలంలోని అరుదూరులో సర్పంచు శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా అర్హులకు ఇంటి పట్టాలు ఇవ్వాలని టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దశరథన్ కోరారు.

బీఎన్ కండ్రిగలో ముగిసిన సదస్సులు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలారివెట్టులో శుక్రవారం జరిగిన సదస్సుతో రెవెన్యు సదస్సులు ముగిశాయి. ఈ సదస్సులో 18 అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ సుబ్రమణ్యం చెప్పారు. మండలంలో ఈ సదస్సుల్లో 556 వినతులు వచ్చాయన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కన్నయ్య నాయుడు, సర్పంచు ప్రసాద్, టీడీపీ నాయకుడు చలపతి, ఆర్‌ఐ నల్లయ్య, ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు టీడీపీ సీనియర్ నేత, ఏపీ సీడ్స్ మాజీ డైరెక్టర్ కందాటి శివశంకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దంజిమేడులో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 55 అర్జీలు వచ్చాయి, తహసీల్దారు భార్గవి తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం: రైతు సమస్యలను గ్రామాల్లోనే పరిష్కరించుకుందామని తహసీల్దారు మునిరత్నంరెడ్డి చెప్పారు. మండలంలోని పీవీకండ్రిగలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులునాయుడు సర్పంచ్ ప్రకాష్‌యాదవ్, బత్తెయ్యయాదవ్, హరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో జరిమానా

రేణిగుంట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, తాగి వాహనాలను నడిపడి వారిని గుర్తించి మొత్తం 23 కేసులను నమోదు చేసి శుక్రవారం కోర్టుకు హాజరుపరిచినట్టు సీఐ శరత్ చంద్ర చెప్పారు. రేణిగుంట అర్బన్, గాజులమండ్యం పోలీసు స్టేషన్ల పరిధిలో డీఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టామన్నారు. నిందితులను విచారించిన 1వ అడిషనల్ జడ్జి జరిమానా విధించినట్టు ఎస్‌ఐ అరుణ్ తెలిపారు.

ప్రధాన రోడ్డులో గుంతల పూడ్చివేత



రేణిగుంట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీకాళహస్తి మార్గంలో రేణిగుంట పట్టణానికి సమీపంలో ఉన్న కొత్త చెక్‌పోస్టు రైల్వే వంతెన వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలను శుక్రవారం పంచాయతీ సిబ్బంది కంకర వేసి పూడ్చారు. వంతెన, చెక్‌పోస్టు కూడలితోపాటు తదితర ప్రాంతాల్లో ఈ పనులు చేపట్టారు. గ్రామసభలో ప్రజల నుంచి ఫిర్యాదులపై స్పందించి ఈ మేరకు చర్యలు చేపట్టినట్టు సర్పంచ్ నాగేశం తెలిపారు.

హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయండి



రేణిగుంట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలని, దేవదాయ కమిటీల్లో హిందువులకు మాత్రమే స్థానం కల్పించాలని తదితర డిమాండ్లతో ఈనెల 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. దేవాలయాల ప్రాంగణాల్లో హిందువులకు మాత్రమే దుకాణాల నిర్వహణ ఉండాలన్నారు. తేజోవతి, బాలాజీ తదితరులు యాత్రను పర్యవేక్షించారు.

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి